# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :100 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 12-06-2024 | పేజీలు:4 వెల: 2.00


## తెలంగాణ టిడిపిలోకి మల్లారెడ్డి ?

హైదరాబాద్,మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తెలంగాణ తెలుగుదేశం పార్టీలో చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. తన ముఖ్య అనుచరులతో గత రెండు రోజులుగా మల్లారెడ్డి సమావేశం నిర్వహిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం. తిరిగి సొంతగూటికి చేరే ఆలోచనలో మల్లారెడ్డి ఉన్నట్లు సమాచారం. 2014 వరకు మల్లారెడ్డి టీటీడీపీలో ఉన్న విషయం తెలిసిందే. ఆ తర్వాత టీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా పనిచేశారు. మల్లారెడ్డి సంస్థల చైర్మన్‌గా ఆయన కొనసాగుతున్నారు. ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తెలంగాణలో ఆ పార్టీకి జోష్ వస్తుందని మల్లారెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. తనపై కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి దాడులు తగ్గాలంటే అధికారంలో ఉన్న పార్టీలో చేరుతానని తన అనుచరులతో మల్లారెడ్డి చెబుతున్నట్లు తెలుస్తోంది.టీటీడీపీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉండటంతో మల్లారెడ్డి ఈ పదవీపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతోనూ ఆయనకు మంచి సంబంధాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## త్వరలో ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు



హైదరాబాద్,అతి త్వరలో తెలంగాణ ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డును తమ ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలియజేశారు. అమెరికా పర్యటనలో భాగంగా గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ వాషింగ్టన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమానికి హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.ప్రవాస భారతీయులు పుట్టిన ఊరుకు మేలు చేసే విధంగా గ్రామ పురోగతిలో భాగస్వాములు కావాలన్నారు. కేరళలో ప్రవాస భారతీయుల సంక్షేమ బోర్డు విజయవంతంగా నడుస్తుందని అంతకన్నా మిన్నగా తెలంగాణ ప్రవాస భారతీయ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.త్వరలో పెద్దపల్లి జిల్లాలో 1000 కోట్లతో కోకకోల మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మూతపడిన నిజాం సుగర్ ఫ్యాక్టరీని ఏడాదిలోగా తెరిచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.చెరుపు రైతులకు మేలు చేయడంతో పాటు ఆ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. హైదరాబాద్ లోనే కాకుండా తెలంగాణ రాష్ట్ర నలుమూలల ఫైబర్ నెట్వర్క్ అందుబాటులో ఉందని, ప్రవాస భారతీయులు పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు రావాలన్నారు.హైదరాబాద్ నగరానికి పరిమితం కాకుండా పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. మూసి రివర్ ఫ్రెంట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. హైదరాబాదును ఏఐ క్యాపిటల్ గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఐటీ విస్తరణకు తమ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ప్రవాస భారతీయులు పుట్టిన గడ్డకు మేలు చేసే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ వాషింగ్టన్ ఫౌండర్ చైర్మన్ విశ్వేశ్వర్ రెడ్డి తో పాటు ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

## పదేళ్ల తర్వాత లోక్ సభలో విపక్ష నేత..



న్యూఢిల్లీ,కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుతో భారత దేశంలో సార్వత్రిక ఎన్నికల అంకం దాదాపు పూర్తి అయింది. ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారంతో మరో ఐదేళ్లు ఆయనే ఉంటారని స్పష్టమైపోయింది. అయితే, ఆర్ఎస్ఎస్ గనుక 'ఇక చాలు' అంటే మోదీ తప్పుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికైతే మోదీ 3.0 మొదలైందనే అనుకోవాలి. గత రెండుసార్లు లేని.. ఇప్పుడే ఉన్న ప్రత్యేకత ఒకటుంది. / పదేళ్లుగా ఖాళీ.. రాష్ట్రాల స్థాయిలో ప్రతిపక్ష నేత ఎంత కీలకమో.. కేంద్రంలో లోక్ సభలో విపక్ష నేత అంతే కీలకం. గత పదేళ్లుగా మోదీ ప్రధానిగా ఉండగా.. ఈ పదవి మాత్రం ఖాళీగా ఉంది. కారణం.. కాంగ్రెస్ సహా మరే ప్రధాన పార్టీ కూడా తగిన సంఖ్యలో సీట్లు సాధించకపోవడమే. లోక్ సభలో మొత్తం స్థానాలు 543. ఇందులో పదో వంతు అంటే 54 స్థానాలు సాధించిన పార్టీకి లోక్ సభలో ప్రతిపక్ష నేత హోదాను పొందే అవకాశం ఉంటుంది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ 44 సీట్లకు, 2019లో కాస్త మెరుగుపడినా 52 స్థానాలకు పరిమితం అయింది. దీంతో ఆ పార్టీకి లోక్ సభలో విపక్ష నేత పదవి దక్కలేదు. యూపీలో 80 సీట్లున్నందున సహజంగానే సమాజ్ వాదీ పార్టీకి తప్ప మరే పార్టీకీ 50 కంటే ఎక్కువ స్థానాలు వచ్చే చాన్సుండదు. ప్రతిపక్ష నేత పదవి దక్కే అవకాశమూ రాదు. అయితేగియితే కాంగ్రెస్ కే. ఈసారి రాహుల్? ఇండియా కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేసినా అధికారానికి కొద్ది దూరంలో ఆగిపోయింది. ఇందులో ప్రధాన పార్టీ కాంగ్రెస్ 100 సీట్లు సాధించింది. పదేళ్ల తర్వాత ఈ మార్క్ ను చేరిన ఆ పార్టీకి ఇప్పుడు లోక్ సభలో విపక్ష నేత హోదా దక్కే చాన్సుంది. దీనికిముందుగానే కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశమై రాహుల్ గాంధీ విపక్ష నేతగా ఉండాల్సిందిగా తీర్మానించింది. అంటే రాహుల్ కాంగ్రెస్ లోక్ సభా పక్ష నేత కానున్నారు. మరోవైపు రాహుల్ విపక్ష నేత కూడా అవడం ఖాయమేనని తెలుస్తోంది. ఇప్పటికే మోదీని తీవ్రంగా విమర్శిస్తూ ప్రజల్లోకి వెళ్లిన రాహుల్ కు విపక్ష నేత పదవి దక్కితే రాజకీయం రంజుగా ఉంటుందనడంలో సందేహం లేదు. కీలక పదవి ఎందుకంటే.. లోక్ సభలో విపక్ష నేత పదవి కేబినెట్ ర్యాంక్ తో సమానం. అంతేకాదు.. సభలో సీట్ల కేటాయింపు, పార్టీలకు కార్యాలయ గదుల కేటాయింపు వంటి చిన్న విషయాలతో పాటు.. పార్లమెంటరీ కమిటీల నియామకంలో విపక్ష నేత పాత్ర ఉండాల్సిందే. అన్నిటికిమించి సీబీఐ, సీవీసీ, ఎన్నికల సంఘం, ఎన్ హెచ్ఆర్సీ వంటి అత్యంత ముఖ్యమైన సంఘాల్లో నియామక కమిటీల్లో లోక్ సభలో విపక్ష నేత ఒక సభ్యుడిగా ఉంటారు.

## కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కి షాక్‌ల మీద షాక్..




కరీంనగర్:కరీంనగర్ బీఆర్ఎస్‌కి కంచుకోట. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ప్రతి ఎన్నికలో సత్తా చాటింది అంతే కాకుండా కరీంనగర్‌ని, బీఆర్ఎస్‌ను విడదీయలేని పరిస్థితి. ఇక్కడ నెగ్గితే తెలంగాణ అంతా పాజిటివ్ ఫలితాలు వస్తాయనే సెంటిమెట్ ఉంది. 2019 ఎన్నికల నుంచి బీఆర్ఎస్ కంచుకోటకి బీటలు వారుతున్నాయి. తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికలలో కనీసం పోటీ కూడా ఇవ్వకుండా మూడవ స్థానానికే పరిమితం కావడం గమనార్హం.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గులాబీ పార్టీ అనుకూల ఫలితాలు సాధించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఉప ఎన్నికలలో గులాబిజెండా రెపరెపలాడిందితెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికలలో క్లీన్‌స్వీప్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలలో తొంభై ఐదు శాతానికి పైగా ఫలితాలు సాధించింది. ఈజిల్లాలో బీఆర్ఎస్‌కు ఇక తిరుగులేదన్న సమయంలో 2019 ఎన్నికలలో బిఅర్ఎస్ కి మొదటిషాక్ తగిలింది. తరువాత 2023 అసెంబ్లీ ఎన్నికలలో అనుకూలమైనా ఫలితాలు సాధించలేక పోయింది. కనీసం ఎంపి ఎన్నికలలో గట్టి పోటి ఇస్తామని నేతలు భావించారు, ఈ ఎన్నికలతొ పార్టీ బలోపేతం అవుతుందని అంచనాలు వేసుకున్నారు. పోటి మాట ఏమో గాని మూడవస్థానానికే పరిమితమై బిఅర్ఎస్ శ్రేణులను తీవ్ర నిరాశకి గురి చేసింది.రాష్ట్రంలో ఒకటో రెండో సీట్లు బిఅర్ఎస్ గెలిస్తే అది కరీంనగర్‌లోనే గెలుస్తుందని నేతలు భావించారు. కానీ వ్యతిరేక ఫలితాలు వచ్చాయి%ొ%ఇక్కడ పార్టీ గట్టిగా ఉన్న కనీసం రెండవ స్థానంలో కూడా నిలబడలేదు. కరీంనగర్ పార్లమెంటు ఫరిధిలో ఏడు అసెంబ్లీలలో ఎక్కడ కూడా లిడ్ ఇవ్వలేక పోయింది%ొ%.బిఅర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఅర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిరిసిల్లలో కూడా లీడ్ ఇవ్వలేక పోయింది. ఇక్కడ మాత్రం రెండవస్థానంలో నిలిచింది..మరో మాజీ మంత్రి గంగుల కమలాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న కరీంనగర్ అసెంబ్లీలొ కనీస ఓట్లు కూడా సాధించలేక పోయింది%ొ%మూడవస్థానానికే పరిమితం అయ్యింది కరీంనగర్ అసెంబ్లీలో.బిఅర్ఎస్ ఎమ్మెల్యే ఉన్న హుజురాబాద్ లోకూడా మూడవస్థానానికే పరిమితం అయ్యింది. ఒకప్పుడు క్యాడర్,లీడర్ లతో బలంగా ఉన్న బిఅర్ఎస్ ఇప్పుడు మూడవస్థానానికే పరిమితం కావడంతో క్యాడర్ అంతా అయోమయానికి గురి అవుతుంది. అయితే ఇది తాత్కలిక అపజయమే అని,స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా ఏమిటో చూపిస్తామని బిఅర్ఎస్ నేతలు అంటున్నారు.

## ఔను వాళ్లిద్దరి పంచాయతీ ముదురుతుంది !



హైదరాబాద్,ఉమ్మడి వరంగల్ జిల్లాలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మధ్య ఆధిపత్య పోరు కాస్తా ముదురుతున్నది. రాజకీయాలు, పాలనా విషయాల్లో ఒకరి మీద ఒకరు పైచేయి సాధించేందుకు ఇద్దరూ పోటాపోటీ వ్యూహాలను అమలు చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన మేడారం జాతర సమయంలో మొదలైన పంచాయితీ కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి మార్పు విషయంలో తీవ్రస్థాయికి చేరింది.వరంగల్‌లోని ధార్మిక భవన్ నుండి కార్యకలాపాలు నిర్వహించాలని దేవాదాయ శాఖా మంత్రి అయిన కొండా సురేఖ భావిస్తున్నది. అయితే ధార్మిక భవన్‌ను వేరే వాటి కోసం వినియోగించే ఆలోచన చేయడం సరికాదని సీతక్క వర్గీయులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ధార్మిక భవన్‌లో సమ్మక్క–సారలమ్మ ఈవో ఆఫీసును కొనసాగించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చేవరకు మేడారంలో పూజలు నిలిపివేస్తామని అక్కడి పూజారులు ఇటీవల ప్రకటించారు. దీని వెనక సీతక్క హస్తం ఉందన్నది కొండా సురేఖ వర్గీయుల వాదన.ఫిబ్రవరిలో జరిగిన మేడారం జాతర విషయంలోనూ ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు మొదలయ్యాయి. సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నియోజకవర్గంలో సమ్మక్క సారలమ్మ దేవాలయం ఉంది. ఈ జాతర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరగాలి. జాతరలో కీలకంగా వ్యవహరించాలని కొండా సురేఖ ఒకటి రెండు సమీక్షలకు వెళ్లగా పనుల ప్రతిపాదన, వాటిని పూర్తి చేయడం, జాతర నిర్వహణలో ఏర్పాట్లపై ఇద్దరి నడుమ విభేదాలు నెలకొన్నాయి. దీంతో జాతర వైపు కొండా సురేఖ మళ్లీ చూడలేదు. సీఎం రేవంత్‌రెడ్డి జాతరకు వచ్చిన రోజు మాత్రం అక్కడకు వచ్చి వెళ్లారు. జాతర నిర్వహణ, పనుల పర్యవేక్షణ అంతా సీతక్కే చూసుకున్నారు.ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ ఇన్‌చార్జిగా ఉన్న కొండా సురేఖను బాధ్యతల నుంచి తప్పించి మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ ప్రకటించింది. సీతక్క సూచనలతోనే సొంత సెగ్మెంట్ నుంచి కొండా సురేఖను దూరం పెట్టారని ఆమె వర్గీయులు ఆనాడే అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మేయర్ గుండు సుధారాణిని తనకు సమాచారం లేకుండా సీతక్క ప్రమేయంతోనే కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని సురేఖ అసంతృప్తితో ఉన్నారు. మెదక్ పార్లమెంట్ లో కాంగ్రెస్ ఓడిపోగా, వరంగల్ లో విజయం సాధించింది. దీని మీద కూడా కొండా సురేఖ వర్గీయులు అసంతృప్తిగా ఉన్నారు. ఈ వివాదానికి ఎక్కడ ముగింపు లభిస్తుందో వేచిచూడాలి.

## ఏపీలో ఆ ప్రాంతాన్ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాం



అమరావతి,ఏపీలో కూటమి సర్కార్ కొలువుదీరబోతోంది. జూన్ 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార చేయనున్నారు. ఇదిలా ఉండగా, మంగళవారం విజయవాడలో మూడు పార్టీల ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీడీఎల్పీ నేతగా చంద్రబాబు నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీలో విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అలాగే విశాఖను ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతామని, కర్నూలును కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్డీఏ శాసనసభ పక్ష నేతగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఏపీ ప్రజలు గతంలో ఎప్పుడూ ఇవ్వని తీర్పునిచ్చారని, ఏపీ ప్రజలు ఐదేళ్లు విధ్వంసకర పాలన చూశారని, అత్యున్నత ఆశయాల కోసం 3 పార్టీలు ఏకమయ్యాయని అన్నారు.1994లో ఏకపక్ష ఎన్నికలు జరిగినా ఇన్ని సీట్లు రాలేదని, చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కడపలో 7కు 5 సీట్లు గెలిచాం.. అభ్యర్థులు గట్టిగా నిలబడ్డ చోట ప్రజలు ఆశీర్వదించారు.. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఢిల్లీలో మమ్మల్ని గౌరవించారని చంద్రబాబు అన్నారు. ఈ తీర్పుతో రాష్ట్ర గౌరవం పెరిగింది.. గెలిచే అభ్యర్థులకే సీట్లు కేటాయించాం.. టీడీపీ, జనసేన పొత్తు గురించి తొలిసారి చెప్పిన వ్యక్తి పవన్ అని గుర్తు చేశారు చంద్రబాబు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లు ఏపీ ప్రజలు విపత్కర పరిస్థితులు చూశారని, ఏపీలో ఎన్డీఏ కూటమి విజయం దేశానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. కూటమి అంటే ఎలా ఉండాలో ఏపీ ప్రజలు దేశానికి చూపించారన్నారు. ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం, కావల్సిన చోట తగ్గాం.. 5 కోట్ల మంది ప్రజలు మనపై ఆశలు పెట్టుకున్నారని అన్నారు. ఇలాంటి సమయంలో సుదీర్ఘమైన అనుభవం ఉన్న నాయకుడు కావాలని, ఈ సమయంలో చంద్రబాబు నాయకత్వం, అనుభవం చాలా అవసరం అని పవన్ అన్నారు. మందుపాతరలు పేలినా బయటపడ్డ నాయకుడు చంద్రబాబు.. ఎన్డీఏ కూటమి నుంచి ముఖ్యమంత్రిగా చంద్రబాబును ప్రతిపాదిస్తున్నామని పవన్ కల్యాణ్ ప్రకటించారు.ఇక పురంధేశ్వరి మాట్లాడుతూ.. కూటమిగా అనూహ్య విజయం సాధించాం.. 3 పార్టీల కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. గత ఐదేళ్లుగా నిజమైన సంక్షేమానికి ప్రజలు దూరమయ్యారు. ఇంతటి ఘన విజయం మనం ఊహించలేదని అన్నారు. మూడు పార్టీల కలయిక రాష్ట్రానికి అవసరమని ప్రజలు భావించారని ఆమె గుర్తు చేశారు.

## తెలంగాణ అభివృద్ధి వైపు రేవంత్ రెడ్డి మరో అడుగు...



హైదరాబాద్,తెలంగాణలో ఎన్నికల కోడ్ ముగియడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దూకుడు పెంచేశారు. పాలనపై పూర్తి ఫోకస్ పెట్టడంతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి మార్క్ డెసిషన్స్ ఎలా ఉంటాయో అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో సరికొత్తగా బయోమెట్రిక్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మొదటిగా ఈ విధానాన్ని సెక్రటేరియట్ నుంచే అమలు చేయడానికి అన్ని సన్నాహాలు జరుపుతున్నట్లు సమాచారం.ప్రభుత్వ ఉద్యోగస్తులు అంటేనే టైం అసలు పాటించరు అనే విమర్శ ఉంది. పైగా చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు సమయానికి రారు.. సమయం కాకముందే వెళ్ళిపోతారు. ఇలా లేటుగా వచ్చి ఎర్లీగా వెళ్తారు అన్న ఆరోపణలు ఎక్కువగా వస్తుండడంతో రేవంత్ రెడ్డి వీటన్నిటికీ చెక్ పెట్టడానికి డిసైడ్ అయినట్లుగా కనిపిస్తోంది. ఇటువంటి విషయాలపై నిఘా ఉంచాలి అంటే కచ్చితంగా బయోమెట్రిక్ విధానాన్ని తీసుకురావాల్సిందే.బయోమెట్రిక్ విధానం ఉంటే కచ్చితంగా ఆఫీసర్లు టైమింగ్ పాటిస్తారు. ఒకవేళ పాటించకపోతే తెలిసిపోతుంది అన్న భయంతో ఆయన పాటించేవాళ్లు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. దీంతో వారు ఎక్కువ సమయం అందుబాటులో ఉండడంతో పాటు పనిలో వేగం కూడా పెరుగుతుంది. తద్వారా సమస్యలు సమయానికి సులభంగా పరిష్కారం కూడా అవుతాయి. అందుకే రేవంత్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.తెలంగాణ సెక్రటేరియట్ లో ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు ఎస్ఎస్ , సెక్రటరీల నుంచి అటెండర్స్ వరకు ఈ బయోమెట్రిక్ విధానాన్ని పాటించే విధంగా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు . ఉద్యోగస్తుల వేలిముద్రలు బయోమెట్రిక్ మిషన్ లో నమోదు చేయడం ద్వారా వారి అటెండెన్స్ తీసుకోవడం ఎంతో సులభం అవుతుంది. ఆఫీస్ కి వచ్చిన వెంటనే బయోమెట్రిక్ మిషన్ లో పంచ్ మార్క్ వేయాలి. మనం ఎన్ని గంటలకు వస్తున్నాం, ఎన్ని గంటలకు వెళ్తున్నాం అన్న విషయాలు ప్రతినెల ఈ మిషన్ నుంచి అనుసంధానించిన కంప్యూటర్ డేటా ద్వారా తెలుసుకోవచ్చు. మొదట ఈ విధానాన్ని సెక్రటేరియట్లో పని చేస్తున్న అందరూ ఉద్యోగస్తులకు తప్పనిసరిగా అవలంబించాలని రేవంత్ సర్కార్ సమాలోచన జరుపుతున్నట్లు టాక్.ఆ తర్వాత జిల్లాలకు క్రమంగా దీన్ని విస్తరించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ విధానాన్ని ఉండేలా చర్యలు తీసుకుంటారట. అయితే ఇటువంటి విధానాలు ప్రభుత్వ ఉద్యోగులు ఎంతవరకు ఆమోదిస్తారు అన్న విషయం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగస్తుల విధానాలు వేరుగా ఉన్నాయి.. మరి అలాంటి సమయంలో ఈ కొత్త నిబంధనలను వాళ్ళు ఎలా స్వీకరిస్తారు అన్న విషయంపై కూడా రేవంత్ సర్కార్ తర్జనభర్జన పడుతోంది. ఏదేమైనాప్పటికీ ప్రజా సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగాలి అనే ఉద్దేశంతో ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడానికి రేవంత్ వెనకాడడం లేదు. ఇక దీనిపై ప్రతిపక్ష నేతలు, కేసీఆర్, కేటీఆర్ ఎలా స్పందిస్తారో చూడాలి.

## మంత్రి పొన్నం అక్రమాలకు పాల్పడుతున్నారు

హైదరాబాద్:రామగుండం ఫ్లై యాష్ తరలింపులో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం లో మాట్లాడారు. బూడిద తరలింపులో మంత్రి అదనంగా రోజుకు రూ.50 లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 13 లారీలను తానే స్వయంగా పట్టుకున్నట్లు తెలిపారు.రవాణా శాఖ అధికారులు రెండు లారీలను మాత్రమే సీజ్ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా ఎన్టీపీసీ(అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడే అందరి పేరు రెడ్ బుక్‌లో రాస్తున్నాం, మేం అధికారంలోకి వచ్చిన నాడు అందరి బండారం బయటపెడుతామన్నారు.




### తప్పుడు ధృవపత్రాలతో ప్లాట్ల కబ్జా

ఆదిలాబాద్,ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాష్ నగర్ 38వ వార్డులో సొసైటీకీ సంబంధించిన 8 ప్లాట్లలో 2 ప్లాట్లని తప్పుడు ధ్రువ పత్రాలతో కబ్జా చేసేందుకు యత్నిస్తున్న కబ్జాదారులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కాలనీ డెవలప్ మెంట్ కమిటీ అధ్యక్షుడు లోక ప్రవీన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు దుర్గం శేఖర్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షాను కలిసి వారు ఫిర్యాదు చేశారు.


## సంపాదకీయం

**బుధవారం 12-06-2024**

# తెలుగు మంత్రులకు పరీక్షా కాలం !

ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఐదు మంత్రి పదవులు దక్కాయి. ఈ ఐదుగురు ఉమ్మడిగా తెలుగు రాష్ట్రాల సమస్యలకు మేలు జరిగేలా చూడాలి. ఎపికి చెందిన టిడిపి మంత్రులు ఎపి సమస్యలపై నిలదీసేందుకు వెనకాడక పోవచ్చు. అలాగే సమస్యలు ప్రస్తావిస్తామని, తమ పదవులను ఎపి ప్రయోజనాలకోసం వినియోగి స్తామని కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌లు ప్రకటించారు. వారికి సమస్యల పట్ల చిత్తశుద్ధి ఉంది. ఎపిని బాగుచేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వేజోన్ వంటివి వారి ఎజెండాలో ఉన్నాయి. తెలంగాణలో కూడా అలాంటి సమస్యల పరిష్కారం చేందుకు ఎజెండాను తయారు చేసుకునే పనిలో ఇక్కడి మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ముందుండాలి. తెలంగాణకోసం లక్షలకోట్లు ఇచ్చామని కాకమ్మకబుర్లు చెబితే ప్రజలు ఇకముందు నమ్మరు. తెలంగాణలో కూడా ఇద్దరు మంత్రులు కొంతకాలం రాజకీయాలను పక్కన పెట్టాలి. అదేపనిగా ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ఎజెండాను పక్కన పెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వంతో కలసి సమస్యల కోసం పోరాడాలి. ఇక్కడ ఏ మేలు జరిగినా ప్రజలకే అన్న భావనలో ముందుకు సాగాలి. తమ రాజకీయాల కోసం ప్రజ సమస్యలను పక్కన పెట్టే ప్రయత్నాలు ఇకనుంచి సడనకుండా చూసుకోవాలి. అన్నింటికి మించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్+-లకు ఎపి సమస్యలపై కొంత డిమాండ్ చేసే పరిస్థితి వచ్చింది. మోదీ బలం కూడా అంతంత మాత్రమే ఉంది. ఈ క్రమంలో దేశం ఎదుర్కొంటున్న ,ముఖ్యంగా ఎపి విభజన సమస్యల పై చర్చల ద్వారా సాధించుకోవాల్సింది చాలా ఉంది. ప్రధాని మోదీ కూడా గతంలోగా కాకుండా కొంత ఉదారంగా వ్యవహరించి ప్రజల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఇకనుంచైనా సహచరులు, మంత్రులు చెప్పే సమస్యలను పరిష్కరించే లక్ష్యం దిశగా పనిచేయాలి. రాజకీయాల్లో కూడా అప్పుడప్పుడు వాతావరణ సమతుల్యత కనిపిస్తుందనడానికి ఇటీవలి ఫలితాలను బేరీజు వేసుకోవచ్చు. ప్రకృతి ప్రమేయం ఇక్కడా కనిపించడం గమనించాలి. తనకు తిరుగులేదనుకున్న వైకాపాను తిరుగుటపా కట్టించిన తీరు చూశాం. 151 సీట్లలో మధ్యలో ఉన్న ఐదును లాగేసుకోవడంతో ఆ పార్టీ 11కు పరిమితం అయ్యింది. తాను అంతా మంచే చేశానని, డబ్బుల పందేరం చేశానని జగన్ వగచినా..జనం నమ్మలేదు. పాలన అంటే డబ్బులు పంచే కార్యక్రమం కాదని జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. చంద్రబాబు కూడా ఇలాంటి ప్రయత్నాల జోలికి పోకుండా రాష్ట్రాన్ని గాడిలో పెట్టే పనిలో పడాలి. అంతుకుముందు తనకు తిరుగు లేదన్న బిఆర్‌ఎస్ అధికారం ఊడబెరికి అవతల పెట్టారు. అయినా ఇంకా ఎగిరెగిరి పడడం చూసి సహించలేని ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఉన్న కోరలను కూడా పీకేశారు. ఇది చాలు..వారి నిర్వాకానికి. అన్నీ తప్పులు చేసి, అప్పులు చేసి, అదే అభివృద్ధి, అదే పాలన అని చెప్పిన జగన్, కెసిఆర్‌లకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఓ రకంగా ప్రకృతి న్యాయం చేసిందనే భావించాలి. ఇది అందరికీ గుణపాఠం కావాలి. అలాగే మోడీని కూడా 240 సీట్లకు పరిమితం చేశారు. ప్రజాస్వామ్యం కలిసి ఉమ్మడి నిర్ణయాలు తీసుకోవల్సి ఉంది. ఇప్పుడు మోడీ కావచ్చు..జగన్ కావచ్చు..రేవంత్ కావచ్చు...ప్రజలను దృష్టి పెట్టుకుని నిర్ణయాలతో ముందుకు సాగాలి. దేశ రాజకీయాలకు సంబంధించి, ఆంధ్రప్రదేశ్ పరిణామాలు, ఆంధ్రప్రదేశ్ తీర్పు ఒక గొప్ప గుణపాఠం అన్నది గుర్తించాలి. మోదీ అనుకున్నట్లుగా నాలుగువందల సీట్లు సాధించివుంటే ఆయనకు పట్టపగ్గాలు ఉండేవి కావు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయం సాధించినా, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల పాత్ర రాష్ట్రం వరకే పరిమితమై ఉండేది. దుష్పరిపాలన అంతం అయిందని ప్రజలు భావించేవారు. రాజధాని మొదలైన అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం యధావిధిగా చంద్రబాబు కేంద్రం చుట్టూ తిరగాల్సి వచ్చేది. భేతాళ కథల్లాగా అలుపెరగకుండా చంద్రబాబు పర్యటనలకే పరిమితం అయ్యేవారు. అయితే ఇప్పుడా పరిస్థితి లేనందుకు సంతోషించాలి. ఇప్పుడున్న ఇద్దరు మంత్రులు గట్టిగా పోరాటం చేయాల్సిందే. చంద్రబాబు కూడా నాన్చివేత ధోరణిని ప్రదర్శించకుండా నిక్కచ్చిగా నిలదీయగలగాలి. అసెంబ్లీ విజయం కంటె లోక్‌సభకు తెలుగుదేశం నుంచి గెలిచిన సభ్యుల సంఖ్యకు అధిక ప్రాధాన్యం ఏర్పడిందన్న విషయం ఎప్పుడూ గుర్తించి ముందుకు సాగాలి. మోడీ కూడా తనకు సీట్లు తక్కువ ఉన్నాయనే భావంతో పనుల్లో జోరు పెంచాలి. విపక్షాలకు గౌవరం ఇవ్వాలి. పార్లమెంట్ ప్రజల సమస్యలకు వేదికగా మారాలి. మోదీకి పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే, చంద్రబాబు ప్రాధాన్యం అత్యంత పరిమితంగా ఉండేది. తెలుగుదేశం బలగం మోదీ ప్రభుత్వ మనుగడకే కీలకం కావడంతో, ఇప్పుడు చంద్రబాబు ప్రపంచం దృష్టిని ఆకర్షించారు. బీజేపీ ప్రభుత్వం దూకుడుకు ఈ రెండు పార్టీలు క్లెళం వేస్తాయని, వేయాలని దేశంలోని వివిధ వర్గాలు కూడా ఆశిస్తున్నాయి. ఏపికి సంబంధించి గౌరవం ఇచ్చి, అభివృద్ధికి ఆసరా ఇచ్చినంత కాలం చంద్రబాబు మిత్రధర్మానికే కట్టుబడి ఉండవచ్చు. లేకుంటే ప్రత్యామ్నాయం కూడా వెంటనే ఉంది. అవతల ఇండియా కూటమి కూడా బలంగానే ఉందన్న విషయం గమనించి దేశం కోసం మోడీ నిజంగానే కష్టపడాలి. ఇంతకాలం చేసిన ప్రచారార్భాటాలు పక్కన పెట్టాలి. ఏకపక్ష పాలనకు, సంకీర్ణ భాగస్వామ్యపాలనకు తేడా ఇప్పుడు ప్రజలు కూడా గమనిస్తుంటారు. ఎవరు కట్టు తప్పినా ప్రజలు చూస్తూనే ఉంటారు. ఒకే దేశం ఒకే నాయకుడు అని భ్రమిస్తే మోడీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇండియా కూటమి అప్రమత్తంగా ఉన్నంత కాలం, బీజేపీ మీద ఆ ఒత్తిడి పనిచేస్తూనే ఉంటుంది. పాలక కూటముల మధ్య పోటీ వల్ల కూడా ప్రజాప్రయోజనాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. మిత్ర పక్షాలన్నిటి నుంచి ఒత్తిడిని తప్పించుకోవడానికి బీజేపీ ఇతర మార్గాల ద్వారా తన బలాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉంటుంది. ఏ పార్టీని, చీల్చుదామా అని అన్వేషిస్తుంటుంది. అందువల్ల అన్ని పార్టీలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిందే. ప్రధాని పదవికి కూడా మచ్చతెచ్చే విధంగా సాగిన విద్వేష ప్రచారాన్ని ఈ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారు. అందువల్ల మోడీ కూడా జాగ్రత్తగా ఐదేళ్లు పాలించి మంచి పేరు తెచ్చు కోవాల్సి ఉంది. అభివృద్ధి ఎజెండగా సాగినంత కాలం ప్రజలు నిరంతరంగా అండగా ఉంటారని గుర్తించి మసలుకోవాలి. నంబర్ గేమ్ కోసం వెంపర్లాడే పనలకు కొంతకాలం విరామం ఇవ్వాలి. ప్రధాని వద్ద సమస్యలను ప్రస్తావించడంలో మంత్రులు నిర్భయంగా ముందుకు సాగాలి. ఈ విషయంలో భయంతో వెళితే సమస్యలు పరిష్కారానికి నోచుకోవని గుర్తించాలి. ముఖ్యంగా బిజెపి మంత్రులు ఇది బాగా గుర్తించాలి.

# సంకీర్ణ ప్రభుత్వం నరేంద్ర మోదీ దూకుడును కట్టడి చేస్తుందా?



న్యూఢిల్లీ,ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ప్రజాస్వామ్యంలో, ఆరు నుంచి డజను పార్టీలు కలిసి అతిపెద్ద సంకీర్ణ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. 1989 నుంచి 2004 వరకు, ఆరు సార్వత్రిక ఎన్నికలలో ఒక్క పార్టీకీ పూర్తి మెజారిటీ రాలేదు. ఈ సంకీర్ణాలలో కొన్ని గందరగోళంగా ఉన్నాయి. 1989 – 1999 మధ్య ఎనిమిది సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి, వాటిలో కొన్ని చాలా తొందరగా కూలిపోయాయి. అయితే, దేశంలో ఆర్థిక సంస్కరణలు, అత్యధిక వృద్ధి రేటు, కాంగ్రెస్, బీజేపీల నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాల సమయంలోనే సాధ్యమయ్యాయి. 2014 తర్వాత 2024లో లోక్‌సభలో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ లేని సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. పుంజుకున్న ప్రతిపక్షాలతో, సీట్లు తగ్గిన బీజేపీకి చెందిన నరేంద్ర మోదీ, మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మెజారిటీ కోసం బీజేపీ ఇప్పుడు ప్రధానంగా తన నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ)లోని రెండు మిత్రపక్షాలపై ఆధారపడింది. అయితే గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా ఇప్పటివరకు మెజారిటీతో పాలించి, దశాబ్దకాలం పాటు రాజకీయాలను శాసించిన మోదీ, సంకీర్ణాన్ని సమర్థంగా నడపగలరా ఆయన తన ఆధిపత్య శైలిని వదిలి, మిత్రపక్షాలతో సామరస్యపూర్వకంగా వ్యవహరిస్తారా? తన పార్టీ, అనుకూలమైన మీడియా ద్వారా పెరిగిన వ్యక్తిత్వ ఆరాధనను వదిలి, అందరినీ కలుపుకుపోతూ, వినయపూర్వకంగా ఉండగలరా? గతంలోనూ బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వాలలో నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు పని చేశారు. అయితే, సంకీర్ణంలో అంతా సాఫీగా సాగడం అసాధ్యమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మోదీ ఎక్కువగా ఆధారపడుతున్న రెండు మిత్రపక్షాలు, రెండు ప్రాంతీయ పార్టీలు. ఒకటి జనతాదళ్ (యునైటెడ్), రెండోది తెలుగుదేశం పార్టీ (టీడీపీ). ఈ రెండు పార్టీలకు కలిపి 28 సీట్లు ఉన్నాయి. నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడు – ఇద్దరూ అనుభవజ్ఞులైన, తెలివైన నాయకులు. గతంలో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వాములుగా ఉన్నారు. అయితే బీజేపీతో, ప్రత్యేకించి మోదీతో విభేదాల కారణంగా దూరం అయ్యారు. 2019లో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, చంద్రబాబు నాయుడు తన రాజకీయ ప్రత్యర్థి అయిన మోదీని, "టెర్రరిస్ట్" అని ముద్ర వేశారు. రాజకీయ స్నేహాలు వింతగా ఉంటాయి. భారత్‌కు ఇలాంటివి కొత్తేమీ కాదు. కేవలం రెండు లేదా మూడు మిత్రపక్షాలపై ఆధారపడిన సంకీర్ణ ప్రభుత్వాలు, ఒక్కరు మద్దతు ఉపసంహరించుకున్నా కూలిపోయే ప్రమాదం ఉంటుంది. మోదీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి దోహదపడుతుందని చాలామంది నమ్ముతున్నారు. ఇది ప్రధానమంత్రి ఆధిపత్యాన్ని తగ్గిస్తుందని, పాలనను వికేంద్రీకరిస్తుందని, దాని వల్ల ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం వస్తుందని, అధికార యంత్రాంగం, న్యాయవ్యవస్థ, మీడియా వంటి సంస్థలను మరింత స్వతంత్రంగా, బలోపేతంగా మార్చగలదని వాళ్లు అంటున్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి 1998 నుంచి 2004 వరకు బహుళ-పార్టీ సంకీర్ణ ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించారు. విదేశీ పెట్టుబడులను సులభతరం చేశారు. ఎక్స్‌ప్రెస్‌వేలను నిర్మించారు. వాణిజ్య అడ్డంకులను తొలగించారు. ఐటీ విప్లవాన్ని తీసుకువచ్చారు. అణు పరీక్షలపై దశాబ్దాల నాటి మారటోరియానికి ముగింపు పలికి, పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలను సడలించి, అమెరికాతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకున్నారు. దీనికి చాలావరకు, అందరినీ కలుపుకుపోయే వాజ్‌పేయి వ్యక్తిత్వం కారణం. అయితే ప్రస్తుత మోదీ నేతృత్వంలోని సంకీర్ణం, గతం కంటే చాలా భిన్నమైనది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 272 స్థానాల కంటే బీజేపీకి వచ్చింది తక్కువే అయినా, 240 సీట్లు సాధించింది కాబట్టి కూటమిలో బీజేపీ ఆధిపత్యం ఉంటుంది. గతంలో, మైనారిటీ ప్రభుత్వాలు తక్కువ సీట్లతో అయినా విజయవంతంగా నడిచాయి. కాంగ్రెస్ 1991లో 232 సీట్లతో, 2004లో 145 సీట్లతో, 2009తో 206 సీట్లతో విజయవంతంగా మైనారిటీ ప్రభుత్వాలను నడిపింది. అయితే ఇప్పుడు మోదీ దూకుడుతో ఉన్న, కొత్త పుంతలు తొక్కుతున్న బీజేపీకి నాయకత్వం వహిస్తున్నారు. కాంగ్రెస్ నేత శశి థరూర్ చెప్పినట్లు మోదీకి అత్యంత సన్నిహితుడైన అమిత్ షా, పాలనలో "నా దారి రహదారి" అనే విధానాన్ని అవలంబిస్తున్నారు. గతంలో, బీజేపీ సంకీర్ణ భాగస్వాములు బీజేపీకి సంబంధించిన కీలకమైన సైద్ధాంతిక, సమీకృత అంశాలను వెనక్కి నెట్టడంలో విజయం సాధించాయి. గత కొన్నేళ్లుగా బీజేపీ ఎజెండాలోని పలు అంశాలు – కశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దు చేయడం, రామ మందిర నిర్మాణం వంటివి, మోదీ నాయకత్వంలో చేశారు. ఈసారి ఎన్నికల ప్రచారంలో మోదీ ప్రజలను మతప్రాతిపదికన విభజించే ప్రసంగాలు చేశారు. మోదీ ప్రత్యేకించి ముస్లింలకు వ్యతిరేకంగా చాలా చోట్ల మాట్లాడారు. అలాంటి మాటలను తగ్గించమని మిత్రపక్షాలు ఇప్పుడు ఆయనకు చెప్పగలుగుతాయా? సంకీర్ణ రాజకీయాలు విజయం సాధించాలంటే ఒక కూటమిగా, సమష్టిగా పనిచేయాలి. సంకీర్ణ భాగస్వామ్య పక్షాలు, బీజేపీ ఏయే ప్రధాన సమస్యలపై ఏకీభవించవచ్చన్నది ఇప్పుడు కీలక ప్రశ్న. భారతదేశంలో 1967 వరకు కేంద్ర, రాష్ట్రాల ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేవారు. తర్వాత రెండు ఎన్నికలను వేర్వేరుగా నిర్వహించడం మొదలైంది. అయితే ఇప్పుడు మళ్లీ మునుపటిలా జమిలి ఎన్నికల కోసం బీజేపీ ఒత్తిడి చేస్తోంది. యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ను తీసుకువస్తామని ఆ పార్టీ వాగ్దానం చేసింది. దేశంలోని మెజారిటీ హిందువులు, మైనారిటీ ముస్లింలు గతంలో దీనిని ప్రతిఘటించారు. 2026 తర్వాత పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన సున్నితమైన సమస్య ఉంది. బీజేపీకి పట్టు ఉన్న పేద, ఎక్కువ జనాభా కలిగిన హిందీ రాష్ట్రాలకు అనుకూలంగా ఉండేలా నియోజకవర్గాలను పునర్విభజిస్తారని సాపేక్షంగా సంపన్నమైన, తక్కువ జనాభా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు భయపడుతున్నాయి. మోదీ మిత్రపక్షాలకు చెందిన ప్రాంతీయ, నిర్దిష్ట డిమాండ్లను కూడా వినాలి. ఆయా నాయకుల ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించాలి. టీడీపీ, జేడీ(యూ) రెండూ తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదాను డిమాండ్ చేశాయి, దీని అర్థం అవి మరిన్ని కేంద్ర నిధులను కోరుతున్నాయి. మోదీ మరిన్ని ఉద్యోగాలను సృష్టించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో వ్యవసాయం, భూమి, కార్మిక రంగంలో అనేక నిర్మాణాత్మక సంస్కరణలు అవసరం. వీటిలో దేనిని సాధించాలన్నా, మోదీకి మిత్రపక్షాలతో సంప్రదింపుల విధానం అవసరం కావచ్చు. ప్రజల దృష్టిని ఆకర్షించాలనుకునే వ్యక్తిగా, మోదీకి అందరినీ కలుపుకుపోయే రాజకీయాలు అంత సులభం కాకపోవచ్చు అని చాలా మంది భావిస్తున్నారు. "హఠాత్తుగా తన జీవితంలో ఇంతకు ముందెన్నడూ నటించని పాత్రలో నటించాలని ఆయనను కోరుతున్నారు" అని మోదీ జీవిత చరిత్ర రచయిత నీలాంజన్ ముఖోపాధ్యాయ అన్నారు. కానీ విజయవంతమైన రాజకీయ నాయకులకు పునర్నిర్మాణ కళలో ప్రావీణ్యం ఉంటుంది. భారతదేశం ఇప్పుడు వినయపూర్వకమైన, సంప్రదింపులు జరిపే, ఏకాభిప్రాయం సాధించే మోదీని చూస్తుందా? "మనం వేచి చూడాలి" అని రాజకీయ విశ్లేషకుడు సందీప్ శాస్త్రి అన్నారు. "మనం దీనిని ప్రస్తుత పరిస్థితుల దృష్టి నుంచి చూడాలి, అంతే తప్ప గతంలోని పొత్తుల ద్వారా కాదు." అన్నారు.

# మంత్రివర్గ కూర్పుపై కసరత్తు

అమరావతి, తెదేపా (అధినేత చంద్రబాబు అమరావతి చేరుకున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రివర్గం ప్రమాణస్వీకారం నేపథ్యంలో దిల్లీ వెళ్లిన ఆయన.. నేరుగా గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చారు. అక్కడి నుంచి ఉండవల్లిలోని నివాసానికి చేరుకున్నారు. బుధవారం సీఎంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు మంత్రివర్గ కూర్పుపై చంద్రబాబు కసరత్తు ముమ్మరం చేయనున్నారు. జిల్లాలవారీగా ఎవరెవరికి అవకాశం కల్పించాల నేదానిపై ముఖ్యనేతలతో ఆయన చర్చించనున్నారు. అనుభవం, వివిధ సామాజికవర్గాలకు ప్రాధాన్యం తదితర అంశాల ఆధారంగా ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలనే దానిపై ఓ నిర్ణయానికి రానున్నారు. మంగళవారం నాటికి దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరే సమయం ఆసన్నమైంది. ఈ నెల 12న కేసరపల్లి వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అలాగే తన మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు కల్పించాలన్న దానిపైనా చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ పదవి, శాఖలపై ఇటీవల ఓ క్లారిటీ వచ్చినట్టు తెలుస్తోంది. దీనిపై టీడీపీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. ఒకవైపు చేతిలో పలు సినిమాలు.. మరోవైపు ప్రజలకు ఇచ్చిన హామీలతో.. పవన్ కళ్యాణ్ కొత్తగా కొలువుదీరే మంత్రివర్గంలో చేరుతారా అన్నది కూడా అనుమానంగా ఉంది. మరోవైపు పవన్ కళ్యాణ్‌కు దాదాపుగా డిప్యూటీ సీఎం పదవి ఖరారైనట్టు టీడీపీ రాజకీయ వర్గాల్లో ఓ టాక్ నడుస్తోంది. అలాగే పవన్ కళ్యాణ్‌కు కీలకమైన శాఖలు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్టు తెలుస్తోంది. గతంలో ఇరువురు నేతలిద్దరూ పదేపదే సార్లు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందని.. అలాగే వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలు, పంచాయితీలకు సరిగ్గా నిధులు కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. దీంతో హోంశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు పవన్ కళ్యాణ్‌కి ఇచ్చే ఛాన్స్ ఉన్నట్టు టీడీపీ, జనసేన వర్గాల్లో టాక్ నడుస్తోంది. అయితే దీనిపై మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అద్భుత విజయాన్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ స్థానాల విషయానికొస్తే.. టీడీపీ 135, బీజేపీ 8, జనసేన 21 గెలుచుకున్నాయి. ఇక ఎంపీ స్థానాల్లో టీడీపీ 16, బీజేపీ 3, జనసేన 2 గెలిచాయి. అటు వైసీపీ 11 అసెంబ్లీ స్థానాలు, 4 లోక్‌సభ స్థానాల్లో గెలుపొందింది.

# పదవులపై జోరుగా చర్చలు

అమరావతి,ఓవైపు చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి చురుకుగా ఏర్పాట్లు... మరోవైపు మంత్రులుగా ఎవరెవరు ఎంతమంది అన్న చర్చ సాగుతోంది. అలాగే పవన్ కళ్యాణ్ కేబినేట్‌లో చేరితో ఆయన ప్రాధాన్యం ఎలా ఉండబోతుందన్న చర్చ కూడా సాగుతోంది. ఆయనకు ఉపముఖ్యమంత్రితో పాటు, హోంశాఖను కేటాయించి నంబర్ టూ స్థానం కల్పిస్తారన్న ప్రచారం సాగుతోంది. ఏపీలో టిడిపి కూటమి 164 అసెంబ్లీ స్థానాల్లో చారిత్రాత్మక విజయం సాధించిన క్రమంలో ఈ నెల 12న టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు కొందరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. అనంతరం మంత్రులకు కేటాయించే శాఖలపైనా ఆయన దృష్టి పెట్టనున్నారు. ప్రమాణస్వీకారానికి ముందే దీనిపై ఓ నిర్ణయానికి రావాలని ఆయన అనుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా, కూటమిలో భాగంగా జనసేన పోటీల చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో మంత్రివర్గంలోకి పవన్ వెళ్తారా? లేక ఆ పార్టీ ఎమ్మెల్యేలకు అవకాశం ఇస్తారా. అనేది ఆసక్తికరంగా మారింది. అయితే, జనసేనాని పవన్ కళ్యాణ్ మంత్రి వర్గంలోకి వెళ్లేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారని.. ఆయన ఏపీ ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకునేందుకు సుముఖంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. మంత్రివర్గంలో చేరితేనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ ప్రభుత్వంలో చేరేందుకు సుముఖంగా ఉన్నారని జనసేన నేతలు కూడా అంగీకరిస్తున్నారు. చంద్రబాబుతో పాటే పవన్ కళ్యాన్ ప్రమాణం ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలో జనగసేన ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు కూడా పరోక్షంగా చెబుతూనే ఉన్నారు. పవన్ చేసిన పోరాటాన్ని అభినందిస్తున్నారు. మరోవైపు 12న ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలోని కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 12న ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నేతృత్వంలోని వేదిక ఏర్పాట్లు జరుగుతున్నాయి. గన్నవరం విమానాశ్రయం ప్రధాన గేట్ నుంచి 800 మీటర్ల దూరంలో సభా ప్రాంగణం ఉంటుంది. ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, ప్రముఖుల రాకకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రాంతాల నుంచి వేదిక వద్దకు చేరుకోడానికి ప్రత్యేకంగా రహదారులను సిద్ధం చేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార ప్రాంగణాన్ని 14 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదికతో పాటు వీఐపీ, వీవీఐపీ, మరో మూడు గ్యాలరీలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. వీవీఐపీ వాహనాల పార్కింగ్‌కు కేసరపల్లి గ్రామంలోని పెట్రోల్ బంక్ వెనుక స్థలం కేటాయించారు. సావరగూడెం రోడ్డులోని ఎస్ఎల్‌వీ, వీఎన్‌పురం కాలనీ మార్గంలోని ఎలైట్ విస్టా లే ఔట్, ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ఆవరణ, ఆర్టీవో కార్యాలయ ప్రాంగణం, మేధా టవర్స్‌లో మొత్తం ఐదు చోట్ల పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార సమయంలో వర్షం కురిసినా ఎలాంటి ఆటంకం లేకుండా వేదిక, సభా ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 2.5 ఎకరాల్లో ప్రధాన వేదిక, వీఐపీ గ్యాలరీ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. మిగిలిన 11.5 ఎకరాల్లో నేతలు, ప్రజలకు నాలుగు గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా అల్యూమినియంతో కూడిన పటిష్ఠమైన షెడ్లను వేస్తున్నారు. సభా ప్రాంగణం వెలుపల పలు చోట్ల భారీ ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేస్తున్నారు. సభ జరిగే సమయంలో నిరంతరాయంగా విద్యుత్తు సరఫరాకు చర్యలు చేపట్టారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఐఏఎస్‌లు హరిజవహర్‌లాల్, బాబు వీరపాండ్యన్, కన్నబాబు, హరికిరణ్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ప్రముఖుల భద్రత, వేదిక, బారికేడింగ్, బ్లాక్‌ల విభజన, పారిశుద్ధ్యం ఏర్పాట్లు, అతిథులకు వసతుల కల్పనలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని సీఎస్ నీరభ్‌కుమార్ ప్రసాద్ అధికారులకు సూచించారు. పార్కింగ్ స్థలాలు, ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను పక్కాగా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను పెద్దసంఖ్యలో అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనే వారికి నియోజకవర్గాల వారీగా వీవీఐపీ, వీఐపీ పాస్‌లను సిద్ధం చేస్తున్నామని టీడీపీ

# నేరచరితులకేదీ అడ్డుకట్ట?



న్యూఢిల్లీ,ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరొందిన ఇండియాలో ఎన్నికలు రానురాను ప్రహసనంగా మారుతున్నాయి. అంగబలం, అర్థబలం ఉన్నవారే తప్ప పేదలు ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే పరిస్థితి మృగ్యమైపోతోంది. సమాజంలో గౌరవ ప్రతిష్టలు, మంచితనం, మానవత్వం, పదుగురికి సాయం చేసే ఉన్నతగుణం.. ఇత్యాది మంచి లక్షణాలు ఉంటే చాలు, ఒక్కసారి ఇట్టే గెలిచేవారు. కానీ, ఇప్పుడు పరిస్థితి లేదు. మంచిగుణాలు ఉన్నా లేకున్నా, ధారాళంగా ఖర్చుపెట్టే స్తోమత, ఎప్పుడూ వెన్నంటి ఉండే అనుచరగణం ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హతలుగా మారాయి. చట్టసభలకు ఎన్నికయ్యే వ్యక్తి సకల గుణాభిరాముడు ఉండాలనీ, పదిమందికీ మార్గదర్శకుడిగా నిలవాలని ఒకప్పుడు భావించేవారు. ఇప్పుడు దీనికీ నిర్వచనం మారిపోయింది. హత్యలు, మానభంగాలు, ఇతర నేరపూరిత చర్యలతో సంబంధం ఉండి, కేసులు ఎదుర్కొంటున్నవారు కూడా నిస్సందేహంగా పోటీ చేస్తున్నారు.. చట్టసభలకు ఎన్నికవుతున్నారు. కొత్తగా కొలువు తీరనున్న 18వ లోక్‌సభకు ఎన్నికైన 543 మంది సభ్యులలో దాదాపు సగం మంది.. 251మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయంటూ అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్ (ఎడిఆర్) ఆందోళన కలిగించే విషయం. నేరచరిత గలవారు గత లోక్ సభ లో 233 మంది ఉంటే, ఈ దఫా ఈ సంఖ్య మరికాస్త పెరగడం కూడా ఇదే. తాజాగా గెలిచిన లోక్‌సభ సభ్యులలో ఇద్దరిపై అత్యాచారం కేసులు, నలుగురు కిడ్నాపింగ్ కేసుల్లో నిందితులు కనిపిస్తున్నారు. కేవలం నేరచరిత గలవారే కాదు, ఈసారి ఎన్నికైనవారిలో 504 మంది కోట్లకు పడగలెత్తినవారేనట. ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా అందరికీ సమానావకాశాలు కల్పించేందుకు అభ్యర్థులు ఎన్నికల్లో చేసే ఎన్నికల సంఘం ఆంక్షలు విధించినా ఆచరణలో అది అపహాస్యం పాలవుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో లోక్‌సభ అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితి రూ. 25 వేలు కాగా, ప్రస్తుతం అది రూ. 95 లక్షలకు చేరింది. ఈ ఖర్చుకు పరిమితమై ప్రచారపర్వాన్ని కొనసాగించడం, విజయావకా శాలు అందుకునే అభ్యర్థులు ఉంటారా అనేది సందేహమే. గడచిన లోక్‌సభలో ఆర్థిక మంత్రిగా సేవలందించిన నిర్మలా సీతారామన్ ఇటీవల ఓ ఘటనలో.. ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన వద్ద డబ్బు లేదని తేల్చి చెప్పింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు సుమారు 55 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశాయని ఓ స్వచ్ఛంద సంస్థ జరిపిన పరిశీలనలో తేలడం డబ్బుకు, ఎన్నికలకు అవినాభావ సంబంధం ఉందని తేటతెల్లం చేస్తోంది. ఎన్నికల సమయంలో అభ్యర్థుల కోసం డబ్బు పంచిపెడుతూ, ఐపిసి సెక్షన్ 171 ప్రకారం ఏడాది వరకూ జైలు శిక్షపడే అవకాశం ఉంటుంది. కానీ, ఏ అభ్యర్థి డబ్బు పంచుతున్నారో, ఆ అభ్యర్థిపై కూడా కేసు పెడితేనే ఈ అరాచకానికి అడ్డుకట్టపడే అవకాశం ఉంటుంది. కానీ, చట్టంలో ఇలాంటి నిబంధన కనిపించదు. చట్టసభల్లో నేరచరితులు అడుగుపెట్టకుండా ఉండాలంటే సదుద్దేశంతో రూపొందించిన ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8 (3) ప్రకారం ఒక వ్యక్తి నేరం చేసినట్లు నిర్ధారణై, రెండేళ్లకు పైబడి శిక్ష పడితే సదరు వ్యక్తి జైలు నుంచి విడుదలైన తేదీ నుంచి ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడవుతాడు. అయితే చట్టం కట్టుదిట్టంగా ఉన్నా, సత్వర న్యాయం అందడంలో ఏళ్లూపూళ్లూ పడుతున్న నేపథ్యంలో, నేరాలు చేసినా 'శిక్ష పడినప్పుడు చూద్దాంలే' అనే ధోరణిలో నిస్సిగ్గుగా చట్టసభలకు పోటీ చేసే ప్రబుద్ధులు ఎక్కువయ్యారు. ఈ లోపాన్ని నివారించేందుకు ఎంపిలు, ఎంఎల్‌ఎలపై నమోదైన కేసులపై వేగిరం విచారణ జరిపేందుకు వీలుగా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలంటూ ఏడేళ్ల కింద సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చట్టసభలలో నేర చరితులు అడుగుపెట్టకుండా అడ్డుకునే పని ఒక్క రాజ్యాంగ సంస్థలకు మాత్రమే అప్పగిస్తే చాలదు, అమూల్యమైన తమ ఓటు హక్కు ద్వారా వారిని చట్టసభలకు పంపిస్తున్న ప్రజలకూ ఇందులో భాగస్వామ్యం ఉంది. సామ దాన భేద దండోపాయాలతో ఎన్నికల్లో నెగ్గాలని ఆశించే రాజకీయ నాయకులు విసిరే తాయిలాలకు ఆశపడే అమాయక జనంలో మార్పు రావాలి. వివేకంతో, విచక్షణతో ఓటు వేసి, నేరచరితులు అడుగుపెట్టకుండా చట్టసభలను ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత ఓటర్లపైనా ఉంది.

## వైకాపా ఓటమితో నైతిక బాధ్యత

నెల్లూరు,ఏపీ ఎన్నికల్లో ఓటమి అనంతరం వైసీపీ వికెట్స్ ఒక్కొక్కటిగా పడుతున్నాయి. నెల్లూరు మేయర్ స్రవంతి ఆ పార్టీకి రాజీనామా చేయబోతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా తనకు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కార్పొరేటర్ టికెట్‌ను ఇచ్చారని.. గెలిచిన మీదట తనను మేయర్‌ను చేశారని తెలిపారు. మాలాంటి ఎందరో కార్యకర్తలకు రాజకీయ అవకాశాలు కల్పించారన్నారు. రాజకీయాల్లో తనకు ధైర్యాన్ని ఇచ్చారని స్రవంతి తెలిపారు. శ్రీధర్ రెడ్డి వైసీపీని వీడినప్పుడు కూడా ఆయసతోనే ఉంటానని స్పష్టం చేశానని వెల్లడించారు. అప్పట్లో అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో వైసీపీలోకి వెళ్ళాల్సి వచ్చిందని.. శ్రీధర్ రెడ్డి పై విమర్శలు చేయాలని అక్కడి నాయకులు తమపై ఒత్తిడి తెచ్చారని స్రవంతి తెలిపారు. అయినా సరే.. శ్రీధర్ రెడ్డిని ఒక మాట కూడా మాట్లాడలేదన్నారు. మా తప్పులను శ్రీధర్ రెడ్డి మన్నించి మమ్ములను అక్కున చేర్చుకోవాలని కోరుకుంటున్నామని

## వైకాపా నేతలను బిజెపిలో చేర్చుకోం

అమరావతి,వైకాపా త్వరలోనే భూస్థాపితం అవుతుందని భాజపా నేత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు భాజపాలో చేరాలని చూస్తున్నారని వెల్లడించారు. అయితే, వారిని భాజపాలో చేర్చుకోబోమని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని శిబిరాల వద్దకు భాజపా నేత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విచ్చేశారు. అమరావతి రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ పనులు వేగంగా కొనసాగుతున్న వేళ ఆయన అక్కడికి చేరుకొని పరిశీలించారు. జగన్ ఓటమికి అమరావతి ఉద్యమం కూడా ఒక ముఖ్య కారణమని తెలిపారు. రాజధానిని తరలించాలని చూసిన జగన్‌కు జనం బుద్ధి చెప్పారన్నారు.

## పక్కన పెట్టిందా..

ముంబై: వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్రమంత్రి వర్గంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు అవకాశం కల్పించారు. కానీ మోదీ కేబినెట్‌లో అజిత్ పవార్‌కు చెందిన ఎన్సీపీకి అవకాశం దక్కలేదు. దీంతో ఆ పార్టీని బీజేపీ పక్కన పెట్టిందా అనే చర్చ సాగుతోంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఆ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించడం అజిత్ పవార్‌కు బీజేపీ ముగింపు పలికినట్లేనంటూ చర్చ సాగుతోంది. అజిత్ పవార్ ఎక్కువమంది ఎమ్మెల్యేలతో పార్టీని చీల్చిడీయేకు ఇచ్చినా.. ఓటు బ్యాంకు మాత్రం అజిత్‌తో రాక మహారాష్ట్ర రాజకీయాల విషయంలో బీజేపీ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. మోదీ 3.0 కేబినెట్‌లో ఎన్సీపీ మినహాయించబడిన ఎన్డీయేలోని అన్ని భాగస్వామ్య చోటు సంపాదించింది. ఒక సీటు గెలుచుకున్న జితన్ రామ్ మాంఝీ మోదీ క్యాబినెట్‌లో మంత్రిగా ప్రమాణం చేశారు. అజిత్ పవార్‌కు చెందిన ఎన్సీపీ నుంచి ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే మంత్రి పదవి రేసులో ఎంపికైన కేబినెట్ పదవిని ఎంపిక చేసిన ఎన్సీపీ కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఎన్సీపీకి సహాయ మంత్రి (ఇండిపెండెంట్) పదవిని బీజేపీ ఆఫర్ చేసింది. ఈ ప్రతిపాదనకు అజిత్ పవార్ అంగీకరించలేదు. దీంతో ఎన్సీపీ మోడీ 3.0 కేబినెట్‌లో చేరలేదు. ఈ చర్యలతో బీజేపీ అజిత్ పవార్ ఆధారపడాలనుకోవడం లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

ఎన్నికల్లో పొత్తు..

అజిత్ పవార్ కూటమిలో ఎన్సీపీ ఎన్డీయే కూటమిలో భాగంగా ఉంది. మహారాష్ట్రలో అజిత్ పవార్ అభ్యర్థిని ఎన్సీపీ బీజేపీతో పొత్తు పెట్టుకుని నాలుగు లోక్‌సభల్లో పోటీచేసి.. కేవలం ఒకచోట మాత్రమే గెలిచింది. ఎన్సీపీ నుంచి సునీల్ తట్కరే మాత్రమే లోక్‌సభ ఎంపీగా గెలిచారు. మోదీ కేబినెట్‌లో ఎన్సీపీ ఆశించింది. అయితే సహాయ మంత్రి పదవిని బీజేపీ ఆఫర్ చేసింది. దీనికి అజిత్ పవార్ అంగీకరించలేదు. ప్రఫుల్ పటేల్ గతంలో కేబినెట్ మంత్రిగా పనిచేశారని.. అటువంటి పరిస్థితుల్లో సహాయ మంత్రి (ఇండిపెండెంట్) బాధ్యతలు తీసుకోవడం సరైనది కాదని.. అవసరమైతే కేబినెట్ మంత్రి కోసం కొద్దిరోజులు వేచిచూస్తామని అజిత్ తెలిపారు. బీజేపీ కూడా వేచిచూస్తే ధోరణిలోనే కనిపిస్తోంది.

అసలు లెక్కలు ఇవే..

మహారాష్ట్రలో రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు బీజేపీ అజిత్ పవార్‌ను తన వెంట తెచ్చుకుంది. కానీ కమలం పార్టీ ప్లాన్ వర్కౌట్ కాలేదు. అజిత్ పవార్ పార్టీ పోటీ చేసిన నాలుగు సీట్లలో ఒకదానిని మాత్రమే గెలుచుకుని.. 3.6 శాతం ఓట్లు. శరద్ పవార్ కూటమిని ఎన్సీపీ ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకుని మహారాష్ట్రలో 10 సీట్లలో ఎనిమిది స్థానాలను గెలుచుకుంది. దీంతో ప్రజలు అసలైన ఎన్సీపీ అధినేతగా శరద్ పవార్‌ను గుర్తించేందుకు స్పష్టమైంది. అజిత్ పవార్ లోక్ సభ ఎన్నికల్లో ప్రభావం చూపించింది అజిత్ పవార్ రాజకీయ భవిష్యత్తు ఏమిటనే చర్చ మొదలైంది. ఈ ఏడాది అక్టోబర్‌లో మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈలోపు అజిత్ పవార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు. ఎన్డీయేతో ప్రయాణిస్తారా.. ఇండియా కూటమిలో చేరతారా అనేది ఆసక్తికరంగా మారింది.

## తక్షణం రూ.2 వేల కోట్లు

అమరావతి : అమరావతి రాజధాని నిర్మాణం రూపురేఖలకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సిఆర్‌డిఎ అధికారులు నిధుల సేకరణపై దృష్టి సారించారు. ఇప్పుడున్న ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్, భవనాల ప్రారంభం, రోడ్ల నిర్మాణం తక్షణం రూ. 2 వేల కోట్లు అవసరమని అంచనా వేయబడింది. వీటిని సమీకరించుకోవడమా, ప్రభుత్వం నుండి తక్షణావసరంగా తీసుకోవడమా అనేది ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుత డెవలప్‌మెంట్ నిధుల తక్షణ పనులు చేపట్టామని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత సీక్రెట్ క్లారిటీ తీసుకున్నామని అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో రోడ్లను గత నాలుగేళ్లలో తవ్వేశారు. కంకరను సొంత అవసరాలు, ఇతర ప్రాజెక్టులకు. కొంతమంది వైసిపి ప్రజాప్రతినిధుల గురించి రైతులు కూడా ఫిర్యాదు చేశారు. దీంతోపాటు ఇనుము, ఇసుక, ఇతర వైరింగ్ మెటీరియల్, పైపులు మొత్తం తరలించుకుపోయారు. వీరిలో ఇరుక్కుని తరలించే నిందితులను పట్టుకుని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుత రాజధాని రూపు రేఖలు రావాలంటే గతంలో వేసిన రోడ్లలో ఎనిమిది రోడ్లను మరలా నిర్మించాల్సి ఉందని అధికారులు చూస్తున్నారు. కొన్నిచోట్ల రోడ్లను నాలుగు అడుగుల మేర తవ్వేశారు. మెటీరియల్‌ను వేరేచోట రోడ్లు వేయడానికి వినియోగించారు. ఒకవైపు నిర్మాణం జరుపుతూనే మరోవైపు విచారణ జరపాలని సిఆర్‌డిఎ అధికారులు నిర్ణయించారు. వీటితోపాటు జంగిల్ క్లియరెన్స్‌కే దాదాపు రూ. 10 కోట్లకుపైగా ఖర్చవుతుందని లెక్కలేస్తున్నారు. తాత్కాలిక పనులు, కనీస సౌకర్యాలకు ఎకరాకు రూ. లక్ష చొప్పున వేసుకున్నా రూ. 350 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. భవనాల పనులు, నిర్మించిన వాటిల్లో సౌకర్యాలు, వీధిలైట్లు, మంచినీటి పైపులైన్లకు ఎంతకాదన్నా ప్రాథమికంగా రూ. 400 కోట్ల వరకు ఖర్చవుతుందని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వేల కోట్ల తక్షణ అవసరాల కోసం రూ. 2 కావాల్సి ఉందని తేల్చినట్లు తెలిసింది.

రోడ్లు కనిపించడం లేదు

నాలుగు రోజులుగా అమరావతిలో తిరుగుతున్న అధికారులకు కొత్త సమస్య వచ్చింది. గతంలో నిర్మించిన అమరావతి రోడ్లు మాయం అయ్యాయని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జ్యుడీషియల్ భవనాల నుండి విట్‌కు వెళ్లే దారిలో రోడ్లు పూర్తిగా మాయమయ్యాయని, ఉద్దండ్రాయునిపాలెం, లింగాయపాలెం పరిసరాల్లో మూడు రోడ్లు అసలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఐనవోలు, వెలగపూడి, తుళ్లూరు గ్రామాల సమీపంలో గతంలో వేసిన పైపులైన్లు కనిపించడం లేదు. అసలు రోడ్లు కనిపించకపోవడం ఏమిటనే అంశంపై ఇప్పుడు సిఆర్‌డిఎ అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం అందరిలో బాధ్యత ఉన్న

# పడి లేచిన ప్రతిపక్షం, ఇంకా ఎక్కడ వెనకబడిందంటే...

న్యూఢిల్లీ,దేశంలో జూన్ 4న వెలువడిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు చాలామందికి ఆశ్చర్యం కలిగించాయి. విజేతలు నిరాడంబరంగా కనిపిస్తే, రన్నరప్‌లు సంబరాలు చేసుకున్నారు. 543 మంది సభ్యులున్న పార్లమెంట్‌లో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి 290కి పైగా సీట్లతో మూడోసారి అధికారం చేపట్టడానికి సిద్ధమవుతోంది. కానీ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన 272 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేదు. ఈ ఫలితం ప్రతిపక్ష ఇండియా కూటమికి, కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీకి పెద్ద కమ్ బ్యాక్ (పునరాగమనం)గా పరిగణిస్తున్నారు. ఇండియా కూటమి కేవలం 230 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే సంఖ్యయితే కాదు, కానీ ఫలితాలు వచ్చిన 24 గంటల తర్వాత కూడా వారు ఆ ప్రయత్నాల్లో ఉన్నారు. ఫలితాలపై రాజకీయ విశ్లేషకుడు రషీద్ కిద్వాయ్ బీబీసీతో మాట్లాడుతూ “ఇది అసాధారణమైన కథ. ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. ప్రతిపక్షం ఊహించని రీతిలో విజయం సాధించింది” అని అన్నారు. ఆనందోత్సాహాలతో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ తీర్పును “మోదీకి నైతిక, రాజకీయ ఓటమి” అని పేర్కొంది, ఈ ఎన్నికలో బీజేపీ ప్రధానంగా మోదీ పేరు, రికార్డులపైనే ప్రచారం చేసింది. ఫలితాల రోజు సాయంత్రం, రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ “దేశం ఏకగ్రీవంగా మోదీ, అమిత్ షాలకు మాకు మీరు వద్దు అంటూ సందేశం పంపింది” అన్నారు. ఈ ఉత్సాహానికి ఒక నేపథ్యం ఉంది. ఎన్నికల సమయంలో ప్రతిపక్షం పూర్తిగా గందరగోళంగా కనిపించింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో 20కిపైగా భిన్నమైన ప్రాంతీయ పార్టీలున్నాయి,ఎన్నికల ముందు కూటమి చీలిపోయే అంచున ఉన్నట్లు కనిపించింది. ఆ సమయంలో తిరుగులేని విధంగా కనిపించిన మోదీని సవాలు చేయగలరా? అని నిపుణులూ ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో విపక్షాలు దీటుగా నిలబడ్డాయి. పార్టీలు, నాయకుల నుంచి దర్యాప్తు ఏజెన్సీల దాడులు జరిగాయి. అరవింద్ కేజ్రీవాల్‌తో సహా ఇద్దరు ముఖ్యమంత్రులు జైలు పాలయ్యారు. కాంగ్రెస్‌కు చెందిన బ్యాంకు ఖాతాలను ఆదాయపు పన్ను అధికారులు స్తంభింపజేసింది.

‘బీజేపీకి బెడిసి కొట్టిందక్కడే’

ప్రతిపక్షాల పనితీరుకు క్రెడిట్ ఎక్కువగా నెహ్రూ-గాంధీ వంశానికి చెందిన రాహుల్ గాంధీకి చెందుతుందని కిద్వాయ్ అన్నారు. ఆయన ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ భారతదేశానికి మొదటి, ఎక్కువ కాలం పనిచేసిన ప్రధానమంత్రి, ఆయన నాన్నమ్మ, తండ్రి కూడా ప్రధానమంత్రులుగా పనిచేశారని అన్నారు. “ఆయన గొప్ప వారసత్వ చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చిన ఐదో తరం నాయకుడు” అని కిద్వాయ్ అన్నారు. “దేశంలోని ప్రధాన మీడియా రాహుల్‌కు చాలా ప్రతికూలంగా ఉంది, సోషల్ మీడియా ఆయనను అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఎక్కువ సెలవులు తీసుకున్న నాన్-సీరియస్ రాజకీయ నాయకుడిగా అంచనా వేసింది.” అని తెలిపారు. కానీ, రాహుల్ గాంధీ అలాంటి అసమానతలను అధిగమించారని, ఇటీవలి సంవత్సరాలలో తనతో పాటు పార్టీపై ఉన్న ఆ అభిప్రాయాన్ని మార్చడానికి చాలా కష్టపడ్డారని కిద్వాయ్ తెలిపారు. “రాహుల్ భారత్ జోడో యాత్ర, న్యాయ్ మార్చ్‌తో దేశం పొడవునా లక్షలాది మందిని కలుసుకున్నారు. ఇది ఆయన స్థాయిని పెంచింది. ఆయనకు విశ్వాసాన్ని, రాజకీయ శక్తిని కూడా ఇచ్చింది.” అన్నారు కిద్వాయ్. కానీ రాహుల్‌ను ఇప్పటికీ మోదీకి ముప్పుగా చాలామంది భావించడం లేదు. గత ఏడాది, మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లోని కోర్టు రాహుల్‌ను పరువు నష్టం కేసులో దోషిగా నిర్ధారించింది. ఆయన పార్లమెంటు సభ్యత్వం రద్దు చేశారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేయకుండా అయిపోయింది. అయితే, సుప్రీంకోర్టు ఆ తీర్పుపై స్టే విధించడంతో రాహుల్ సభ్యత్వం పునరుద్ధరించారు. ‘విపక్షాల వెంటాడి వేటాడే తత్వం’ బెడిసికొట్టిందని రాజకీయ విశ్లేషకుడు, రచయిత అజోయ్ బోస్ అభిప్రాయపడ్డారు. “బీజేపీ కాస్త అహంకారంతో, ఆత్మసంతృప్తితో ఉంది. కానీ ప్రతిపక్షాలను భయపెట్టడానికి వారు ఎంచుకున్న మార్గాలు, వ్యూహాలు బీజేపీకే వ్యతిరేకంగా పని చేశాయి, ఇండియా కూటమి ఏర్పాటుకు దారితీసింది. పార్టీలు, తాము తుడిచిపెట్టుకుపోతామని భయపడ్డాయి, చాలామంది ఎమర్జెన్సీ రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు.” అని తెలిపారు. “దేశం ఏకపక్ష నియంతృత్వంగా మారడం పట్ల ప్రజల్లో అశాంతి, అసౌకర్యం ఏర్పడింది” అని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో బలమైన ప్రతిఘటనను ఎదుర్కొంది. తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ కీలకంగా ఉన్న రాష్ట్రంలోని మొత్తం 39 స్థానాలను ఇండియా కూటమి గెలుచుకుంది. బీజేపీ కనీసం ఒక్క స్థానం కూడా గెలుచుకోలేదు. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బీజేపీని 12



స్థానాలకు పరిమితం చేశారు (2019లో 42 స్థానాలకు గాను 18 స్థానాలను మోదీ పార్టీ గెలుచుకుంది). మహారాష్ట్రలో బీజేపీ తొమ్మిది స్థానాలకే పరిమితమైంది, 2019లో అక్కడ బీజేపీ 48 సీట్లలో 23 గెలుచుకుంది, అప్పటి మిత్రపక్షమైన శివసేన మరో 18 స్థానాలను కైవసం చేసుకుంది. కానీ మోదీ, బీజేపీలకు అతిపెద్ద నష్టం ఉత్తరప్రదేశ్‌లో జరిగిందని బోస్ చెప్పారు. “సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ)ది ఈ ఎన్నికలలో అతిపెద్ద విజయం. రాహుల్ గాంధీతో పొత్తు పెట్టుకుని యూపీలోని 80 సీట్లలో 43 సీట్లు గెలుచుకున్నారు. బీజేపీ సంఖ్య 33కి పరిమితమైంది. మోదీ పార్టీ అక్కడ 2019లో 62 సీట్లు గెలుచుకోగా, 2014లో 71 సీట్లు సాధించింది. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్‌లను “పెయిర్ ఆఫ్ బాయ్స్” అంటూ మోదీ అభివర్ణించారు. వారి కూటమి గతంలో చాలాసార్లు పరాజయం పాలైంది. అయితే ఈ జోడీ వల్ల యూపీలో బీజేపీకి పరాభవం ఎదురైంది. “అయోధ్య నగరంలో కొత్త రామ మందిరం కూడా బీజేపీ గెలవడానికి సాయపడలేదు.” అని బోస్ అన్నారు. మోదీ నేతృత్వంలో జనవరిలో చాలా ఆర్భాటంగా అయోధ్యలో అసంపూర్తిగా ఉన్న ఆలయాన్ని ప్రారంభించి, పార్టీ తమ ట్రంప్ కార్డ్‌గా రామమందిర ఆలయాన్ని పరిగణించింది. కానీ ఆలయం ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో మాత్రం బీజేపీ అభ్యర్థి ఓడిపోయారు.

‘ర్యాలీలతో మాకు అర్థమైంది’

ఎస్పీ యువజన విభాగం నాయకుడు, ఆ పార్టీకి స్టార్ క్యాంపెయినర్ అయిన అభిషేక్ యాదవ్ బీబీసీతో మాట్లాడుతూ యూపీని గెలవడానికి ఈ ఆలయం సహాయపడుతుందని బీజేపీ నమ్మిందని అన్నారు. “ఏప్రిల్ ప్రారంభం వరకు యూపీలో ఎన్నికలు మాకు వ్యతిరేకంగా, ఏకపక్ష పోటీలా అనిపించాయి. కానీ మా ర్యాలీలకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావడం మొదలైనప్పుడు బీజేపీపై అంతర్లీనంగా ఆగ్రహం ఉందని మాకు అర్థమైంది.” అని యాదవ్ అన్నారు. ఉద్యోగాలు లేకపోవడం, ఆహారం, ఇంధనం ధరలు పెరగడం పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని ఆయన అన్నారు. ఆర్మీ సైనికులను నియమించే విధానంలో వచ్చిన మార్పులపై కూడా పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. “ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్, ఎస్పీ కలిసి ఎన్నికల్లో పోరాడుతున్నందున, బీజేపీ వ్యతిరేక ఓటర్లందరూ మాకు ఓటు వేయడానికి ఏకమయ్యారు.” అన్నారాయన.

‘కూటమే చేజార్చుకుంది’

ప్రతిపక్ష కూటమి పనితీరు బాగానే ఉన్నప్పటికీ, కొన్ని విషయాలలో ఓటర్ల మనసును అర్థం చేసుకోవడంలో అది విఫలమైందని కిద్వాయ్ అన్నారు. మోదీ ప్రభుత్వం పట్ల ప్రజలలో ఎక్కడ ఎక్కువ అసంతృప్తి ఉందో పసిగట్టలేక ఇండియా కూటమి అవకాశాన్ని చేజార్చుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. “నిరుద్యోగం, గ్రామీణ ఆర్థిక దుస్థితి గురించి మాట్లాడారు, చాలామంది ఓటర్ల మనసులను గెలుచుకోగలిగారు. కానీ వారి వ్యూహంలో చాలా లోటుపాట్లు ఉన్నాయి.” అని కిద్వాయ్ చెప్పారు. “ఇండియా కూటమిలోని బలహీనతల కారణంగానే ఎన్‌డీఏ మూడోసారి అధికారంలోకి వస్తోంది. వారు ఆంధ్రప్రదేశ్, ఒడిశాలలో పొత్తులు కుదుర్చుకోగలిగారు. అది మెజారిటీని ఇచ్చింది. కానీ ఇప్పుడు ఎన్డీఏ, మోదీ తిరిగి అధికారంలోకి వచ్చినందున, ‘ఇండియా’ దాని కూటమిని స్థిరపరుచుకోవాల్సిన అవసరం ఉంది. కూటమిని రాహుల్ ముందుండి నడిపించాలి.” అని కిద్వాయ్ చెప్పారు. “ప్రభుత్వం ప్రతిపక్షాల వెంటాడటం ఆగకపోవచ్చు. కానీ అది కూడా ప్రభుత్వానికి అంత సులభం కాదు. వారు తమ రాజకీయాలను ప్రతీకారంతో కొనసాగించలేరు.” అని అన్నారు. “గాంధీలు తమను తాము అధికారానికి ధర్మకర్తలు (ట్రస్టీలు)గా పరిగణిస్తారు, అధికారం అంటే ఏలడానికి కాదు. వారు కూడా మారాల్సిన సమయం వచ్చింది. రాహుల్ గాంధీ పగ్గాలు చేపట్టి నాయకత్వం వహించాలి” అని ఆయన అభిప్రాయపడ్డారు.

## అమరావతికి మళ్లీ జీవకళ..చెత్తా చెదారం తొలగింపు ప్రక్రియ



అమరావతి,అమరావతికి మళ్లీ జీవం వచ్చింది. ఈ ప్రాంతం కళకళలాడబోతున్నది. భూములు ఇచ్చిన రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. అమరావతి నిర్మాణం కోసం చంద్రబాబు ఇక తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆగిపోయిన పనులను పరుగెత్తించగలరన్న విశ్వాసంలో ప్రజలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడబోతున్న తరుణంలో రాజధాని అమరావతి కళకళలాడుతోంది. వంద పొక్లయిన్‌లు, వందల మంది కార్మికులు, రాత్రి పగలు సాగుతున్న పనులతో ఇప్పుడు అమరావతికి పునర్వైభవం వస్తోంది. ఐదేళ్లుగా పేరుకుపోయిన చెత్తను అధికారులు తొలగిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం రెండు రోజుల్లో కొలువు దీరనుంది. ఈ లోపు అక్కడ ఉన్న పరిస్థితిపై నివేదిక ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మూడు రాజధానుల పేరుతో అమరావతి ప్రాంతాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతో కంప చెట్లు పేరుకుపోయాయి. ఆ ప్రాంతమంతా అడవిని తలపించింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అక్కడ మళ్లీ కార్యాచరణ మొదలయ్యాయి. సీఎస్‌గా నీరబ్‌కుమార్ పగ్గాలు చెపట్టిన తర్వాత అమరావతిలో పనులు ప్రారంభమయ్యాయి. మూడు నాలుగు రోజుల నుంచి అమరావతిలో ముళ్లకంపను తొలించే పని చేస్తున్నారు. 25 ప్రాంతాల్లో వందకుపైగా కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం నాటికి అమరావతిలో పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పనులను నీరబ్ కుమార్ స్వయంగా పరిశీలించారు. అమరావతిలో పనులు జరుగుతున్న ప్రాంతంలో పర్యటించిన సీఎస్ నీరబ్ కుమార్... అక్కడ అధికారులతో మాట్లాడారు. సుమారు రెండు మూడు గంటలు ఆ ప్రాంతంలో గడిపిన ఆయన.. జరుగుతున్న పనులు పరిశీలించారు. రోడ్లను కూడా పరిశీలించారు. రాజధాని కోసం శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని కూడా చూశారు. చాలా రోజుల తర్వాత ఉన్నతాధికారులు తమ ప్రాంతానికి రావడంపై రాజధాని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ఆదేశాలతో అమరావతిలో పనులు చేపట్టారు. మొదటి దశలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నామని తర్వాత సమీక్షించి అక్కడ పనులు పురోగతిపై నివేదిక ఇస్తామన్నారు. అమరావతి ప్రాంతంలో జరిగిన చోరీలపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల కౌలు అంశంపై కూడా త్వరగానే నిర్ణయం తీసుకుంటామని చెబుతామన్నారు. మరోవైపు 12న ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబుకు అమరావతిపై సమగ్రమైన నివేదిక ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న కట్టడాల పటిష్టతపై ఆరా తీయనున్నారు. దీని కోసం ఓ కమిటీ ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం అందుతోంది. వీలైనంత త్వరగా కమిటీ రిపోర్టు ఇచ్చేలా చేసి రాజధాని పనులు త్వరితగతిన చేపట్టాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకు వేసిన రహదారులు పూర్తిగా పాడైపోయాయి. విద్యుత్ దీపాలు వెలగడం లేదు. వాటిని పునరుద్ధరించారు. రహదారులను కూడా మరోసారి సరిచేయాలి. వీటన్నింటికి చాలా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులతో రాజధాని ప్రాంతంలో జనాల రాకపోకలు కనిపిస్తున్నాయి.

## వైకాపా సైకోలు జైలుకెళ్లడం ఖాయం

విజయవాడ,వైఎస్సార్సీపి సైకో మూకలు జైలుకెళ్లడానికి సిద్ధం కావాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ హెచ్చరించారు. ప్రజలు మక్కెలు విరగొట్టి 11సీట్లతో మోకాళ్లపై కూర్చోబెట్టినా వైసీపీ నేతల అరాచకాలు ఆగడంలేదని ధ్వజమెత్తారు. కర్నూలు జిల్లాలో టీడీపీ నేత గిరినాథ్‌ను వైసీపీ సైకో మూకలు దారుణంగా హతమార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ్ ÷ర్ అయ్యారు. టీడీపీ కార్యాయలంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలపై లెక్కలేనన్ని దాడులు చేశారని చెప్పారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్రపై 22 సార్లు దాడి చేశారని దుయ్యబట్టారు. ఆనాడు వైసీపీకి ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. చెన్నుపాటి గాంధీపై దాడిచేసి కన్ను పోగొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రగొండపాలెం, నందిగామలో చంద్రబాబు పర్యటనలపై దాడిచేశారన్నారు. తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై చాలాసార్లు దాడి చేశారు... అప్పుడు వైసీపీ నేతలకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. తనపై దాడిచేసి తన బిడ్డను భయపెట్టినప్పుడు వైసీపీ సైకోలకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుందని స్పష్టం చేశారు. కూటమి పార్టీలు ప్రజాస్వామ్య పరిరక్షణ కట్టుబడి ఉన్నాయని ఉద్ఘాటించారు. తెలుగుదేశం హింసను ప్రేరేపించదు... చంద్రబాబు ప్రజాస్వామ్య విలువలను తమకు ఎప్పుడూ గుర్తు చేస్తారని వివరించారు. ఏపీలో ఎక్కడా భౌతికదాడులు జరగవు.. వైసీపీ నేతలు భయపడాల్సిన పనిలేదన్నారు. ఐసీపీ సెక్షన్ల పవరేంటో చూపిస్తాం.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టామని వార్నింగ్ ఇచ్చారు. లోకేశ్ రెడ్ బుక్ రియాల్టీ ఏంటో చూపిస్తామని పట్టాభి రామ్ పేర్కొన్నారు.

## నీలినీడలు

హైదరాబాద్,ఓవైపు వానకాలం మొదలైనప్పటికీ చేప పిల్లల పంపిణీ పథకం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. వాస్తవానికి ఇప్పటికే టెండర్ ప్రక్రియను ప్రారంభించాలి. జూలై చివర్లో లేదా ఆగస్టులో చేపల పంపిణీని ప్రారంభించాలి. కానీ ఇప్పటి వరకు అమలుకు టెండర్ ప్రక్రియ ఊసే లేకపోవడం. కేసీఆర్ ప్రభుత్వం ప్రతియేటా మే నెలలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించి జూలై లేదా ఆగస్టులో పంపిణీని ప్రారంభిస్తుంది. ఈ విధంగా 2016-17 నుంచి 2023-24 వరకు అంటే ఏడేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో 550 కోట్ల చేపలు, రొయ్య పిల్లలను విడుదల చేసింది. దాదాపు రూ. 523 కోట్లు ఖర్చు చేయడం. ఈ పథకం ద్వారా దాదాపు రూ. 32వేల కోట్ల మత్స్య సంపద ఉత్పత్తి అయినట్టు మత్స్యశాఖ. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఈ శాఖకు మంత్రి కూడా లేరు. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి వద్దే ఈ శాఖ ఉంది. ఈ నేపథ్యంలో ఏ అంశమైనా సీఎం దృష్టికి తీసుకెళ్లలేక అధికారులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే చేప పిల్లల పంపిణీకి సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడేందుకు అధికారులకు మార్గం దొరకడం లేదు. ఇప్పటికే రెండుసార్లు పథకం అమలుకు మత్స్యశాఖ అధికారులు లేఖ రాసినట్టు తెలిసింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదని ఆ శాఖ వర్గాలు తెలిపాయి. పంపిణీకి సంబంధించిన బిల్లులను కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. సుమారు రూ. 104 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. చేసిన చేప పిల్లలు సరఫరా చేసిన కాంట్రాక్టర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిల్లుల కోసం ప్రభుత్వం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇదిలా ఉంటే చేపల పంపిణీలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపల పంపిణీ పథకం అమలుపై ఆసక్తిగా లేనట్టు తెలిసింది.

5 లక్షల కుటుంబాలకు ఉపాధి దూరం..

ఒకవేళ ఉచితంగా చేప పిల్లల పంపిణీ నిలిపివేస్తే 5 లక్షల మత్స్యకార కుటుంబాలు తమ ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 6వేల మత్స్యకార సొసైటీలు ఉన్నాయి. ఇందులో అధికారికంగా 3.75 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీళ్లంతా కేసీఆర్ ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంతో జీవనోపాధి పొందుతున్నారు. ఈ పథకం ద్వారా సుమారు 23 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి అయినట్టు అంచనా. వీటి అమ్మకం ద్వారా కనీసం రూ. 32వేల కోట్ల సంపద సృష్టి జరిగింది. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతమయ్యారు.

ఉత్పత్తి బంద్.. మళ్లీ దిగుమతులు

చేపల పంపిణీ పథకంతో రాష్ట్రంలో సమృద్ధిగా చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉచిత చేపల పంపిణీ ప్రారంభం అంటే 2016-17లో రాష్ట్రంలో కేవలం 2 లక్షల టన్నుల చేపలు మాత్రమే ఉత్పత్తి అయ్యేవి. అది ఇప్పుడు 4.38 లక్షల టన్నులకు పెరిగింది. ఈ విధంగా గడిచిన ఏడేండ్లలో రాష్ట్రంలో చేపల ఉత్పత్తి సుమారు 125 శాతం పెరిగింది. దీంతో రాష్ట్రంలో ఎక్కడపడితే అక్కడ పుష్కలంగా చేపలు లభించాయి. వర్షాకాలంలో అయితే మత్తళ్లు దుంకినప్పుడు చేపల వరద పారింది. గతంలో రాష్ట్రంలో చేపల ఉత్పత్తి తక్కువగా ఉండటంతో ఏపీ నుంచి దిగుమతి చేసుకునేవాళ్లు. కానీ చేపల పంపిణీతో ఏపీ నుంచి చేపల దిగుమతి పూర్తిగా బంద్ అయింది. ఇంకా రాష్ట్రం నుంచి ఢిల్లీ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ ఎదిగింది. ఇలాంటి పరిస్థితుల్లో చేపల పంపిణీ నిలిపివేస్తే మళ్లీ ఇతర ఉత్పత్తుల నుంచి దిగుమతులు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో చేపల ధరలు పెరిగినప్పటికీ, చేపల ధరలు పెరుగుతున్నాయి.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచన

హైదరాబాద్,కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్(ట్విటర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ నుంచి మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు అభినందనలు తెలియజేశారు. విభజన చట్టం అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. ప్రాజెక్టుల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రమాణం చేశారు. ప్రధాని తర్వాత ప్రమాణం పూర్తిచేసిన 71 మంది కేంద్రమంత్రుల్లో 30 మందికి క్యాబినెట్ హోదా దక్కింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర కేబినెట్ బెర్త్ దక్కించుకున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమర్, కింజారపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు భూపతిరాజు శ్రీనివాసవర్మకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి, రావాల్సిన నిధులపై శక్తివంచన లేకుండా కృషిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈమేరకు సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. విభజన చట్టంలోని అంశాల అమలు, కేంద్రం నుండి తెలుగు రాష్ట్రాలకు

# మహిళలపై బీజేపీ ఐటీ సెల్ అధిపతి వేధింపులు!



న్యూఢిల్లీ,బీజేపీ ఐటీ సెల్ అధిపతి అమిత్ మాలవీయ మహిళలపై శృంగార వేధింపులతోపాటు అనేక నీచమైన కార్యకలాపాలకు ఆరెస్సెస్ సభ్యుడు శంతను సిన్హా సమాచారం అందించారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలపై మాలవీయ లీగల్ టీం సోమవారం స్పందించింది.మాలవీయపై చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పడంతోపాటు అన్ని సామాజిక మాధ్యమాల నుంచి మూడు రోజుల్లో ఆ వ్యాఖ్యలను తొలగించాలని లేదా అన్ని చర్యలు తీసుకుంటామని నోటీసు పంపింది. ముందుగా మాలవీయకు కలిగిన మానసిక క్షోభకు, గౌరవ భంగానికి గాను నష్టపరిహారం కింద రూ.10 కోట్లు డిమాండ్ చేసింది. బీజేపీ నేత రాహుల్ సిన్హాకు బంధువు అయిన శంతను సిన్హా ఇటీవల ఫేస్‌బుక్‌లో మాలవీయకు వ్యతిరేకంగా ఒక పోస్ట్ పెట్టారు.మాలవీయ వారి మహిళలపై శస్త్ర చికిత్సలు జరిపినట్లు, అనేక నీచమైన చర్యలలో భాగస్వామి అని. ఈ ఆరోపణలపై కాంగ్రెస్ పార్టీ సూచన.. తక్షణం మాలవీయ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. మాలవీయ చేతిలో దోపిడీకి గురైన మహిళలకు బీజేపీ న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేథ్ డిమాండ్ చేశారు. ప్రధానిగా మోదీ ప్రమాణం చేసిన 24 గంటల్లోనే ఓ ప్రముఖ బీజేపీ నేతపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. మాలవీయ చర్యలపై స్వతంత్ర దర్యాప్తు చేయాలని అన్నారు.

వ్యాఖ్యలు ఉపసంహరించుకోను: సిన్హా

ఫేస్‌బుక్‌లో తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని శంతనుసిన్హా స్పష్టం చేశారు. కొందు బీజేపీ నేతలు తమ అధికార పదవులను కాపాడుకోవడం కోసం తమ ఢిల్లీ బాస్‌లను ప్రసన్నం చేశారని అనేక అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. Facebookలో తన పోస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, సామాజిక మాధ్యమం నుంచి వాటిని తొలగించలేదని, ఒత్తిళ్లకు లొంగిపోయే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తనకు అందిన లీగల్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు కొంత సమయం కావాలని కోరినట్లు తెలిపారు.

# తమిళ రాజకీయాల్లో .. నామ్ తమిళర్ కట్చి సంచలనం



చెన్నై: అన్ని సీట్లూ గెలుచుకున్నామని సంతోషంలో ఉన్న అన్నాడీఎంకేకు, సీట్లు దక్కకుండా పోయాయని బాధపడుతున్న బీజేపీ, అన్నాడీఎంకేలకు కొత్త సవాలు తమిళనాట పుట్టుకొస్తున్నదా? అవును. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 12 నియోజకవర్గాల్లో లక్షకు పైగా ఓట్లు తెచ్చుకున్నది. ఆరు స్థానాల్లో బీజేపీ, అన్నాడీఎంకేల తర్వాత మూడో స్థానంలో నిలిచింది. 2019లో తెచ్చుకున్న 3.8 శాతం ఓట్లను ఈసారి ఏకంగా మూడు రెట్లు.. అంటే 8.2 శాతానికి తెచ్చుకున్నది. రాష్ట్ర రాజకీయాల్లో భవిష్యత్తులో తానొక బలీయమైన శక్తిగా ముందుకు రానున్నానని బలమైన సంకేతాలు పంపింది. ఆ పార్టీయే.. నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే). ఎన్టీకే పెరుగుదల నెమ్మదిగానే కనిపిస్తున్నప్పటికీ.. స్థిరంగా ఉండటం గమనార్హం. రాష్ట్రంలోని ఇతర రాజకీయ పార్టీలకు ఇదొక హెచ్చరిక అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దాని నాయకుడు సీమన్ ఒంటిచేత్తో తన పార్టీని బలోపేతం చేసుకుంటూ వస్తున్నారు.గతంలో సినీ దర్శకుడిగా ఉండి.. ఇప్పుడు రాజకీయ నాయకుడిగా మారిన సీమన్.. ఈ ఎన్నికల్లో ఏ కూటమిలోనూ చేరలేదు. తమిళ గుర్తింపు ఆవశ్యకత సిద్ధాంతంతో ఆయన ఇచ్చే ఉద్వేగపూరిత ఉపన్యాసాలు.. ఆయనకు ఒక నాయకుడి హోదాను ఆటోమెటిక్‌గానే తెచ్చిపెట్టాయి. 12 నియోజకవర్గాల్లో ఎన్టీకేకు లక్షకుపైగా ఓట్లు వచ్చాయి. అందులో శివగంగైలో లక్షా 63వేలకు పైగా ఓట్లు సాధించింది. కన్యాకుమారి, ఈరోడ్, కల్లకురిచి, నాగపట్నం, తిరుచిరాపల్లి, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్టీకే మూడో స్థానంలో నిలిచింది. ఈ ఎన్నికల్లో ఈ ఆరు సీట్లలోనూ ఇండియా కూటమి విజయం సాధించింది. రెండింటిలో బీజేపీ, మరో నాలిగింటిలో అన్నాడీఎంకే రెండో స్థానంలో ఉన్నాయి. మధ్య తమిళనాడులోలో ఎన్టీకే అత్యుత్తమ ప్రదర్శనను కనబర్చింది. తిరుచిరాపల్లిలో ఓటు శాతాన్ని 10.18 శాతానికి పెంచుకుని, ఎన్డీయేను నాలుగో స్థానంలో నిలిపింది. నాగపట్నంలో 13.49శాతం, మైలాదుతురాయిలో 11.73శాతం, రాష్ట్రంలో బాగా వెనుకబడిన జిల్లాల్లో ఒకటైన పెరంబదూర్‌లో 10.02 శాతం ఓట్లు కైవసం చేసుకున్నది.రాష్ట్రంలో బీజేపీ చేసిన ఎన్నికల ప్రచారానికి మీడియాలో అధిక ప్రాధాన్యం కల్పించిన నేపథ్యంలో తమ ఓట్లు తగ్గుతాయని భావించామని సీమన్ సన్నిహితుడొకరు చెప్పారు. రాష్ట్రంలో డీఎంకే, జాతీయ స్థాయిలో బీజేపీ అధిక సీట్లు గెలుస్తాయని భావించామని అన్నారు. అయితే.. తాము రాష్ట్ర రాజకీయాలకే పరిమితమైన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఎవరూ ఓటు వేయరని చాలా మంది అనుకున్నారని, కానీ ఈసారి తాము కొత్త ఎన్నికల చిహ్నం మైక్ గుర్తుతో పోటీ చేసినప్పటికీ.. అందరి అంచనాలను సీమన్ పటాపంచలు చేశారని చెప్పారు. 2009లో మూకుమ్మడి దాడితో శ్రీలంక సైన్యం ఎల్‌టీటీఈని అంతమొందించిన అనంతరం ఎన్టీకే ఆవిర్భవించింది. ఆ సమయంలో తమిళ సెంటిమెంట్ తీవ్రస్థాయిలో ఉన్నది. ఆ సమయంలో శ్రీలంకలోని తమిళులు బాధితులైన అంశాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సందేశంతోనే తమిళనాడు ఓటర్లను, ప్రత్యేకించి యువతను ఆకర్షించారు. ఆయన విశ్వసనీయతను ఆయన ప్రత్యర్థులు పదేపదే సవాలు చేశారు. తమిళ సెంటిమెంట్‌ను వాడుకుంటున్నారని ఆయనపై విమర్శలు కురిపించారు. రాజకీయ ఫండింగ్ కోసం తమిళ ఎన్నారైలను వాడుకుంటున్నారని ఆరోపించారు. కానీ.. ఆ విమర్శలను ఎన్టీకే తట్టుకుని నిలబడింది. సీమన్ మినహా స్టార్ ప్రచారకులు లేకపోయినా, డబ్బు బలం లేకపోయినా.. మీడియాలో కనీసం చోటు లేకపోయినా ఎన్టీకే సత్తా చాటింది.వాస్తవానికి డీఎంకే దివంగత అధినేత ఎం కరుణానిధి, ఆ తర్వాత అన్నాడీఎంకే దివంగత అధినేత్రి జయలలితను కలిసిన సమయంలో సీమన్ నాస్తికత్వం గురించి, పెరియార్ హేతువాదం గురించి మాట్లాడారు. కానీ.. తర్వాత పూర్తిగా తమిళ జాతీయవాదం, జాతి గుర్తింపుపైనే కేంద్రీకరించారు. తమిళనాడు తిరిగి తన సాంస్కృతిక మూలాలకు వెళ్లాలని వాదించేవారు. ఈ క్రమంలోనే హిందూజాతి సిద్ధాంతాన్ని ప్రవచించే ఆరెస్సెస్, హిందూత్వ వాదాలను వ్యతిరేకించే బలమైన నాయకుడిగా ఎదిగారు. అప్పటి నుంచి ఏ కూటమి వైపూ మొగ్గు చూపలేదు. ప్రాంతీయ, జాతీయ పార్టీల నియంత్రణలోకి వెళ్లకుండా.. సొంతగా తమిళ ఆకాంక్షలకు ప్రతినిధిగా నిలిచారు.

# పాత వారికే ప్రధానశాఖలు.. ఆ నలుగురు భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీలో సభ్యులు



న్యూఢిల్లీ/ హైదరాబాద్, కేంద్ర మంత్రులకు సోమవారం శాఖలను కేటాయించారు. హోం, రక్షణ, ఆర్థిక, విదేశాంగ వంటి కీలక శాఖల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఆయా శాఖలకు గత ప్రభుత్వంలో మంత్రులుగా చేసిన అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, జై శంకర్‌లనే కొత్త ప్రభుత్వంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ నలుగురు మంత్రులే ప్రధానిగా ఉండే భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. నితిన్ గడ్కరీకి రోడ్డు రవాణా, జాతీయ మున్సిపల్ శాఖను కొనసాగించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గతంలో చేసిన ఆరోగ్య శాఖను తిరిగి పొందారు. గత ప్రభుత్వంలో స్మృతి ఇరానీ నిర్వర్తించిన మహిళా, శిశు సంక్షేమ శాఖను అన్నపూర్ణా దేవికి అందించారు. ఈ మేరకు మంత్రులకు కేటాయించిన శాఖల వివరాలతో కూడిన జాబితాను రాష్ట్రపతి కార్యాలయం సోమవారం విడుదల చేసింది.
ప్రకటనజి

తెలుగు ఎంపీలకు కీలక పదవులు

కేంద్ర క్యాబినెట్‌లో తెలుగు ఫలితాల ఎంపీలకు కీలక పదవులు దక్కాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా నియమితులయ్యారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పదవి దక్కింది. తెలంగాణలో ఈ హోదా దక్కిన మూడో ఎంపీ బండి సంజయ్ కావడం విశేషం. గతంలో కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు సైతం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రులుగా పనిచేశారు. శాఖల కేటాయింపు తర్వాత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. దేశాభివృద్ధిలో బొగ్గు పాత్ర కీలకమని, బొగ్గు వెలికితీత, ఎగుమతి, ఉద్యోగుల సంక్షేమం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారులతో చర్చించిన తర్వాత ఒకట్రెండు రోజుల్లో 'మిషన్ 100 డేస్ అజెండా'తో ముందుకెళ్తామన్నారు. దేశమంతా విద్యుత్తు డిమాండ్ పెరుగుతున్నదని, దీనికి అనుగుణంగా బొగ్గు కొరత లేకుండా విద్యుదుత్పత్తి పెంచడంపై దృష్టి సారిస్తామన్నారు. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటు కోసం ప్రయత్నించారు.

ఏపీ నుంచి ఇద్దరు సహాయ మంత్రులు

తాజా క్యాబినెట్‌లో ఏపీకి చెందిన టీడీపీ ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కేంద్ర పౌర విమానయాన శాఖ బాధ్యతలు అప్పగించారు. పెమ్మసాని చంద్రశేఖర్‌కు గ్రామీణాభివృద్ధి, సమాచార శాఖల సహాయ మంత్రి, భూపతిరాజు శ్రీనివాస వర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల సహాయ మంత్రి పదవి దక్కింది. మరోవైపు కేంద్ర క్యాబినెట్‌లో చేరిన బీజేపీ మిత్రపక్షాలపై జేడీయూ, జేడీఎస్, హెచ్‌ఏఎం, ఎల్జేపీ(రామ్ విలాస్)ల్లో పలు పార్టీలకు కీలక మంత్రి పదవులు దక్కాయి. జేడీఎస్ నేత కుమారస్వామికి కీలకమైన భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖను కేటాయించారు. ఇక జేడీయూ నేత లలన్ సింగ్‌కు పంచాయతీ రాజ్‌తో సహా పలు ఇతర శాఖలు దక్కాయి.

శాఖల్లో జోడింపులు.. కోతలు

గత ప్రభుత్వంలో మంత్రులుగా చేసిన వారిలో కొంత మందికి అదనపు శాఖలు కేటాయించారు, మరికొంత మందికి శాఖల్లో కోత విధించారు. అశ్వినీ వైష్ణవ్‌కు రైల్వే శాఖతోపాటు కీలకమైన ప్రసార శాఖ బాధ్యతలను కూడా అప్పగించారు. హర్దీప్ సింగ్ పురీ నిర్వర్తించిన శాఖల్లో గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖను ఆయన నుంచి ఈసారి తీసేసుకున్నారు. కిరణ్ రిజిజును ఎర్త్ సైన్సెస్ నుంచి పార్లమెంటరీ వ్యవహారాలకు మార్చారు. గిరిరాజ్ సింగ్‌ను గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ నుంచి జౌళి శాఖకు మార్చారు. అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను న్యాయశాఖ మంత్రిగా కొనసాగించారు. నూతన క్యాబినెట్‌లో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ సీఎంలకు కీలక శాఖలు దక్కాయి. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ దక్కింది. హర్యానా మాజీ సీఎం ఖట్టర్‌కు విద్యుత్తు, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇచ్చారు.

పీఎం కిసాన్ నిధుల విడుదలపై ప్రధాని మోదీ తొలి సంతకం

భారత ప్రధానిగా నరేంద్ర మోదీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వరుసగా మూడోసారి ప్రధాని అయిన తర్వాత ఆయన పీఎం కిసాన్ 17వ విడత నిధుల విడుదలకు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీని ద్వారా దేశంలో దాదాపు 9.3 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని నిధుల విడుదల ఫైల్‌పై సంతకం తర్వాత మోదీ ప్రకటించారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలని అన్నారు.

3 కోట్ల ఇండ్ల నిర్మాణం గ్రీన్ సిగ్నల్.. తొలి క్యాబినెట్ భేటీలో నిర్ణయం ప్రధాన మంత్రి ఆవాస్ పథకం (ప్రధాన మంత్రి ఆవాస్) కింద అదనంగా 3 కోట్ల ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రధాని మోదీ హామీని క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ అందించారు. మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ఎన్డీయే సర్కార్ తొలి క్యాబినెట్ సమావేశం సోమవారం ప్రధాని మోదీ నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశానికి ఎన్డీయే మిత్ర పక్షాల మంత్రులంతా మద్దతు.'గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హులైన పేద కుటుంబాల సంఖ్య పెరిగింది. గృహ అవసరాలను తీర్చేందుకు అదనంగా మరో 3 కోట్ల గ్రామీణ, పట్టణ కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి సహాయం చేయాలని క్యాబినెట్ సమావేశం నిర్ణయించింది' అని కేంద్ర అధికారులు తెలిపారు.

# ఐదువేల లోపు ఓట్లతో 15 సీట్లు తారుమారు...



న్యూఢిల్లీ,దేశంలో ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 15 లోక్‌సభ నియోజక వర్గాల్లో అభ్యర్థులు అతితక్కువ మెజారిటీలతో బయటపడ్డారు. ముంబై వాయువ్య నియోజకవర్గంలో అతితక్కువగా 48 ఓట్ల ఆధిక్యతతో ఏక్‌నాథషిండే నాయకత్వంలోని శివసేన విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో తక్కువ మెజారిటీల్లో ఇదే రికార్డు. ఆ తర్వాత కేరళలోని అత్తింగళ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సమీప సీపీఎం అభ్యర్థిపై 684 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించింది. ఒరిస్సాలోని జాజ్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సమీప బీజేడీ అభ్యర్థిపై 1587 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రాజస్థాన్‌లోని జైపూర్ రూరల్ నియోజకవర్గంలో బీజేపీ సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 1615 ఓట్ల ఆధిక్యంతో బయటపడ్డది.అలాగే చత్తీస్‌గడ్‌లోని కేంకర్ నియోజకవర్గంలో బీజేపీ సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 1884 ఓట్ల మెజారిటీతో గెలిచింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆరు నియోజకవర్గాల్లో కేవలం ఐదు వేల ఓట్ల లోపు ఆధిక్యతతో పార్టీలు విజయకేతనం ఎగురవేశాయి. బాన్స్‌గాంలో బీజేపీ 3150 ఓట్లతో, దౌరాహ్రాలో ఎస్పీ 4449 ఓట్లతో, ఫరూఖాబాద్‌లో బీజేపీ 2678 ఓట్లతో, ఫూల్‌పూర్‌లో బీజేపీ 4332 ఓట్లతో, హమీర్‌పూర్‌లో ఎస్పీ 2629 ఓట్లతో, సలీంపూర్‌లో ఎస్పీ 3573 ఓట్లతో విజయం సాధించాయి. తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో బీజేపీ 4500 ఓట్ల ఆధిక్యంతో గెలిచింది. తమిళనాడులోని విరుధ్‌నగర్‌లో కాంగ్రెస్ 4379 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో కాంగ్రెస్ సమీప ఆప్ అభ్యర్థిపై 3242 ఓట్ల మెజారిటీతో గెలిచింది. మహారాష్ట్రలోని ధూలేలో కాంగ్రెస్ ఆధిక్యత 3831 ఓట్లు మాత్రమే. ఐదు వేల లోపు ఆధిక్యతతో గెల్చుకున్న సీట్లలో ఎన్డీఏవి ఎనిమిది కాగా, ఇండియా కూటమివి 7 సీట్లు ఉన్నాయి.

# మొదటిసారి ముస్లింలకు లేని కేంద్ర క్యాబినెట్



న్యూఢిల్లీ,స్వాతంత్ర్యనంతర భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆదరణ సాంయత్రం ప్రధాని నరేంద్ర మోడీతోపాటు ప్రమాణం చేసిన మంత్రులలో ముస్లిం సమాజం నుంచి ఒక్కరికి కూడా ప్రాధాన్యం లభించలేదు. మోడీ క్యాబినెట్‌లో ముస్లిం ఎంపీకి చోటు దక్కకపోవడం ఇదే మొదటిసారి. భారతదేశ 15వ ప్రధానిగా నరేంద్ర మోడీ ఆదివారం మూడవ పర్యాయం బాధ్యతలు. వరుసగా మూడుసార్లు ప్రధానిగా ప్రధాని బాధ్యతలు చేపట్టిన ఘనత దేశ తొలి జవహర్‌ఆలా నెహ్రూ తర్వాత మోడీకే దక్కింది. అయితే 2019లో మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినపుడు మంత్రిగా ర్యాసభ సభ్యుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ప్రమాణం చేశారు. ఆయనకు మైనారి శాఖను అప్పగించారు. అయితే 2022లో ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసి తిరిగి ఎన్నిక కాకు ఆ శాఖ ఖాళీగానే ఉండిపోయింది.2014లో మోడీ తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు మంత్రిగా నజ్మా హెప్తుల్లా ప్రమాణం చేశారు. 199లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినపుడు షానవాజ్ హుస్సేన్, ఒమర్ అబ్దుల్లా మంత్రులుగా పనిచేశారు. 1998లో వాజ్‌పేయి అనుమతి ప్రభుత్వంలో కూడా నఖ్వీ సహాయ మంత్రిగా పనిచేశారు. కాగా..ఇప్పుడు ప్రధాని మోడీతోపాటు ప్రమాణం చేసిన 71 మంది మంత్రుల్లో 30 మందికి క్యాబినెట్ హోదా, ఐదుగురికి ఇండిపెండెంట్ చార్జీలు, 36 మందికి సహాయ మంత్రులుగా చోటు దక్కింది. అయితే వీరిలో ముస్లిం ఎంపీలు ఒక్కరు కూడా లేకపోవడం విశేషం. అయితే..ప్రభుత్వంలో ముస్లింలకు ప్రాధాన్యం లభించనప్పటికీ పార్లమెంట్‌లో మాత్రం పెద్ద సంఖ్యలో ప్రతిపక్షంలో ముస్లిం ఎంపీలు ఉండనున్నారు. ఇండియా నుంచి 21 మంది ముస్లిం కూటమి ఎంపీలతోపాటు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇద్దరు ఇండిపెండెంట్ ముస్లిం ఎంపీలు పార్లమెంట్‌లో ప్రతిపక్షంలో కూర్చోనున్నారు.ఇండిపెండెంట్ ఎంపీలలో జమ్మూ కశ్మీరు నుంచి అబ్దుల్ రషీద్ షేక్ లేక ఇంజనీర్ రషీద్, మొహమ్మద్ హనీఫా ఉన్నారు. ఇలా ఉండగా, ఎంపీలు కాకపోయినప్పటికీ ఇద్దరు సిక్కు, క్రైస్తవ ఎంపీలకు మోడీ క్యాబినెట్‌లో చోటు దక్కడం విశేషం. పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ రాజా సింగ్ చేతిలో ఓటమిపాలైన రవనీత్ సింగ్ బిట్టూకు, మూడు దశాబ్దాలుగా బిజెపినే నమ్ముకున్న జార్జి కురియన్‌కు మోడీ తన క్యాబినెట్‌లో చోటు కల్పించారు. ఖలిస్తానీ ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైన పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి బియాంత్ సింగ్ మనవడైన బిట్టూగతంలో కాంగ్రెస్‌లో ఉండి ఈ ఏడాదే బిజెపిలో చేరారు.

## భోజన కార్మికులకు గౌరవ వేతనం ఇవ్వాలి

ఆదిలాబాద్,మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రతినెల గౌరవ వేతనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని భోజన పథకం యూనియన్ జిల్లా కార్యదర్శి లింగాల చిన్నన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన

# మెగా డిఎస్సీతో టీచర్ల నియామక ప్రక్రియ



హైదరాబాద్,ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందించేలా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని ఉద్ఘాటించారు. శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ.2వేల కోట్లతో పనులు ప్రారంభించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని తమ ప్రభుత్వం నిర్వహిస్తోందని ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు రావట్లేదని సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలను మూసివేయొద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్కార్ పాఠశాలలను సరిగా పట్టించుకోలేదని.. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మౌలిక వసతులపై దృష్టి కేంద్రీకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి భేషజాలు లేవు.. ఎవరైనా సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఇలాంటి మంచి కార్యక్రమం ద్వారా తమ బాధ్యతను గుర్తు చేసిందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడి సర్కార్ పాఠశాలల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమని అభినందించారు. కార్పొరేట్ పాఠశాలలతో ప్రభుత్వ విద్యార్థులు పోటీపడటం గౌరవాన్ని మరింత పెంచిందని ఉద్ఘాటించారు. విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 90శాతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ పాఠాశాలల్లో చదివినవారేనని గుర్తుచేశారు. తనతో సహా ప్రముఖ రాజకీయ నాయకులంతా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారేనని అన్నారు. గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా తల్లిదండ్రులకు పిల్లల సంబంధాలు బలహీనపడుతున్నాయని ఒక స్టడీ రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో ఉండే పాఠశాలలపై నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. విద్య మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యపై పెట్టుబడి పెడితే సమాజానికి లాభాన్ని చేకూరుస్తుందన్నారు. త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లను ఏర్పాటు చేసి నిరంతరం సమస్యలను పరిష్కరించే వెసులుబాటు కల్పించబోతున్నామని చెప్పారు. 10/10 వచ్చిన విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇంటర్మీడియట్‌లోనూ స్టేట్ ర్యాంకులు సాధించి భవిష్యత్‌లో రాణించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉందని.. ప్రజా పాలనపై నమ్మకం కలిగించేలా ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదివి పదోతరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిభాపురస్కారాలు అందజేశారు. రవీంద్రభారతిలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన వందేమాతరం ఫౌండేషన్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. కొంత కాలంగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయి. స్కూళ్లలో టీచర్లు లేరని విద్యార్థులు రావట్లేదు.. విద్యార్థుల్లేరని బడులు మూసివేస్తున్నారు. ఇది కోడి ముందా, గుడ్డు ముందా అన్నట్లుగా తయారైంది. ప్రభుత్వం టీచర్లను పెట్టకపోతే.. విద్యార్థులు రారు.. విద్యార్థులు రావడం లేదనే నెపంతో సింగిల్ టీచర్ పాఠశాలలన్నింటినీ మూసివేసే పరిస్థితి కొనసాగింది. కొన్ని బడుల్లో విద్యార్థుల కన్నా టీచర్ల సంఖ్యే ఎక్కువగా ఉన్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితులన్నింటినీ దృష్టిలో ఉంచుకొనే తక్షణమే 11వేల పైచీలుకు పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. సింగిల్ టీచర్ బడుల్ని మూసేయడానికి వీల్లేదని, తండాలు, గూడేల్లో, మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ బడులను నిర్వహించడం ద్వారా పేదలు, దళితులు, గిరిజనులకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం' అన్నారు.వందేమాతరం ఫౌండేషన్‌కు అభినందనలు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్ని ప్రోత్సహించడం అభినందనీయం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com